RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 29 ఆగస్టు 2025 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:75

# ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించాలి.. రేవంత్ రెడ్డి

జిల్లాలో భారీ వర్షాలు వరదల సహాయక చర్యల్లో పాలన యంత్రాంగం తీరు అభినందనీయం

యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును చరవాణి ద్వారా ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







మెదక్ ప్రజాబలం ప్రతినిధి: 28 ఆగస్టు 2025

భారీ వర్షాలు వరదలపై జిల్లా యంత్రాంగం తరపున చేపట్టిన సహాయక చర్యలను వివరించిన జిల్లా కలెక్టర్ రాహుల్

పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో గౌరవ వందన స్వీకరించిన ముఖ్యమంత్రివర్యులు

స్వాగతం తెలిపిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు.

మెదక్ జిల్లాలో గురువారం సాయంత్రం ఒక గంట పాటు సాగినన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి పర్యటన

సాయంత్రం ఐదు 5.20 నిమిషాలకు

మెదక్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ముఖ్యమంత్రి గారు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు.

అధికారులతో సమీక్షించిన అనంతరం ఫ్లడ్ ఎఫెక్టెడ్ ఫోటో ఎగ్జిబిషన్ తిలకించి 6.20కు తిరుగు ప్రయాణమయ్యారు.

భారీ వర్షాలు వరదల కారణంగా ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని సహాయక చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని అధికారులతో జిల్లాలో భారీ వర్షాలు వరదలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఆకస్మికంగా సంభవించేవే ప్రకృతి విపత్తులు అని అటువంటి విపత్తుల సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి నష్టం పంట నష్టం ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం ఆస్తి నష్టం ప్రాణనష్టాన్ని అంచనాలకు అనుగుణంగా నష్టపరిహారానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు.

మెదక్ జిల్లాలో భారీగా వర్షాలు వరదలు ముంచేత్తుతున్న కారణంగా వాగులు చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ లో భాగంగా వరద నష్టాలను అంచనాలు వేస్తూ శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జి లు కట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేసినప్పుడు ఫోటో క్యాప్చర్ వీడియో క్యాప్చర్ ద్వారా జిల్లాలో జరిగిన సమగ్ర వివరాలను భద్రపరచాలని సూచించారు

వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

జిల్లాల యూరియా కొరత విషయంలో

బఫర్ స్టాక్ డిస్ప్లే చేస్తూ ఉన్నామని

రైతులు రాబోవు పంటలకు కూడా ఇప్పటి నుండే యూరియా కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని

నానో యూరియా పై రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు.

చివరగా ఫ్లడ్ ఎఫక్టెడ్ ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులుతో పాటు పౌరసరఫరాల శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి,పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావ్, మెదక్ ఎంపీ రఘు నందన్ రావు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అదనపు కలెక్టర్ నగేష్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**మెదక్ పార్లమెంట్ అభివృద్ధికి సంబంధించి ఎంపీ రఘునందన్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి**

మెదక్ ఎస్పీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం

మెదక్ పార్లమెంట్ అభివృద్ధికి సంబంధించి ఎంపీ రఘునందన్ రావు నాలుగు ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వాటిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిర్ణయాలు తీసుకున్నారు:

1మెదక్ –బూరుగుపల్లి – రాజాపేట – కామారెడ్డి రహదారి

ఈ మార్గంలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిలను ఎత్తు పెంచి, రహదారిని డబుల్ రోడ్‌గా విస్తరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన సీఎం పంచాయతీరాజ్ రహదారిని ఆర్ & బి పరిధిలోకి మార్చి డబుల్ రోడ్‌గా విస్తరించేందుకు జిల్లా కలెక్టరుకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు.

2 పిల్లికోటాల సబ్‌స్టేషన్ (మెదక్)

వరదలతో పూర్తిగా మునిగిపోయిన 33 కెవి సబ్‌స్టేషన్ బదులుగా, కొత్త స్థలంలో మూడు నుంచి ఐదు కోట్ల వ్యయంతో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు.

సీఎం వెంటనే అధికారులను దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

3 రామాయంపేట మహిళా డిగ్రీ కళాశాల

వర్షాల కారణంగా 350 మంది విద్యార్థినులు ప్రైవేట్ భవనంలో ఇబ్బందులు పడుతున్న విషయం ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై స్పందించిన సీఎం రామాయంపేటలో కొత్త మహిళా రెసిడెన్షియల్ కళాశాల స్థాపనకు స్థలం కేటాయించి ప్రతిపాదనలు పంపితే వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

4రామాయంపేట బస్ డిపో

రామాయంపేటలో పూర్తి హంగులతో కొత్త బస్ డిపో ఏర్పాటు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి దీనిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే మనకు ప్రాణ వాయువు: సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగష్టు 28 ప్రజాబలం ప్రతినిధి: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే మనకు ప్రాణ వాయువు అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ పనికి రాకుండా పోయిందని అన్నారు. సిఎం, ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నుంచి కామారెడ్డికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బయలు దేరారు. కామారెడ్డిలో ముంపు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టు కు మధ్య తేడా ఉందని, ఇంజనీరింగ్ నిపుణులు చెప్పిన చోట ఎల్లంపల్లిని నిర్మించారని తెలియజేశారు.నిపుణులు కట్టిన ప్రాజెక్టు కాబట్టే దశాబ్దాలుగా ఎల్లంపల్లి నిలబండిందని కొనియాడారు. గోదావరి జలాల విషయంలో ఎల్లంపల్లి మనకు కీలకమని అన్నారు. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ సూచన ప్రకారం వెళ్తామని, మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకే రకంగా కట్టారని పేర్కొన్నారు. 3 బ్యారేజీల్లో నీటినిల్వ, ఎత్తిపోత క్షేమం కాదని ఎన్డిఎస్ఎ చెప్పిందని, నిర్మాణం, నిర్వహణలో లోపం ఉందని నిపుణుల కమిటీ చెప్పిందని అన్నారు. నీరు నిల్వ చేశాక మొత్తం కూలిపోతే.. గ్రామాలు కొట్టుకు పోతాయని, కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందుకెళ్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నీరు చేరిన ఇళ్లలోని ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలి



వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ప్రత్యక్ష పర్యటనలు నిర్వహించాలి

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ

హైదరాబాద్ ఆగస్టు 28 ప్రజాబలం ప్రతినిధి : వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ప్రత్యక్ష పర్యటనలు నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ఇళ్లను పరిశీలించి, నీరు చేరిన ఇళ్లలోని ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని, నీటి ముంపు ఉన్న ఇళ్ల నుంచి నీరు బయటికి పంపే చర్యలు చేపట్టాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలో వరద పరిస్థితిపై జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్, కలెక్టర్, ఎస్పితో పాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు జిల్లాలోని వర్షాల తీవ్రత, వరద ఉధృతి, నష్టపరిస్థితులపై మంత్రికి వివరాలు అందించారు. ఈ సందర్భంగా సీతక్క అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, ఎలాంటి అప్రమత్తత లోపం జరగకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు.వర్షం పూర్తిగా ఆగే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్, వ్యవసాయ, మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలు తక్షణం నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు మనోధైర్యం కల్పించాలని, గ్రామాల్లో శానిటేషన్ పనులను వేగవంతం చేసి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని, ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తలు పాటించాలని, వాతావరణం అనుకూలించగానే స్వయంగా జిల్లాలో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.

# బిసి రిజర్వేషన్ పెంపుపై 3 ఆప్షన్లకు మంత్రుల కమిటీ ఎంపిక

మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ ఆగష్టు 28 ప్రజాబలం ప్రతినిధి బిసి రిజర్వేషన్ పెంపుపై 3 ఆప్షన్లకు మంత్రుల కమిటీ ఎంపిక చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు . బిసి రిజర్వేషన్ పెంపుపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీకి వస్తారని అనుకుంటున్నానని మంత్రి తెలిపారు. విమర్శలపై కెసిఆర్ సమాధానం చెప్పుకుంటే బాగుంటుందని అన్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడుతూ..సిఎం రేవంత్ రెడ్డి తో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు సమావేశం అయ్యారు. ఏ ఆప్షన్ ఎంచుకోవాలన్న దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో బిజెపి ఆమోదం తెలిపిందని తెలియజేశారు. కేంద్రంలో మాత్రం అడ్డుకుంటుందని పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.

ప్రజాబలం

# తెలంగాణను వీడని వానలు

29 ఆగస్ట్ 2025 శుక్రవారం

## ఆర్థికానికి ప్రమాద ఘంటికలు

తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉద్యోగుల తొలగింపు అంటే ఆర్థిక సవాళ్లు లేదా పని లేకపోవడంవల్ల ఉద్యోగులను పని నుండి తీసివేయడం. ఈ భావన 1980 -90లలో వాటాదారుల విలువను పెంచడానికి ఖర్చు తగ్గించే వ్యూహంగా, విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. ఇది కంపెనీలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చినప్పటికీ, ఉద్యోగుల తొలగింపులు తరచుగా అనిశ్చితిని సృష్టించడం, ఉద్యోగ భద్రతను తగ్గించడం, ఉద్యోగుల ప్రేరణను, ధైర్యాన్ని దెబ్బతీస్తాయి. ఇటీవల కార్పొరేట్ సంస్థలు ఆర్థిక ఒత్తిళు , పెట్టుబడిదారుల డిమాండ్లు, పునర్నిర్మాణం, కృత్రిమ మేధస్సు(ఎఐ), క్లౌడ్ కంప్యూటింగ్, స్థిరత్వం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల వైపు మారడం వల్ల ఉద్యోగుల తొలగింపులను అమలు చేస్తున్నాయి. భారతదేశంలో అతిపెద్ద ఐటి సంస్థ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తన శ్రామిక శక్తిని 2%(దీ12,000 ఉద్యోగాలు) తగ్గిస్తోంది. అమేజాన్, మెటా, సిస్కోూామ్ఖిఓశీఅ, వీమ్ఖ(10,000 ఉద్యోగ విరమణలు), సిస్కో కూడా తగ్గించుకున్నాయి. టెక్ సంస్థలతోపాటు, పిడబ్లుసి (ప్రాతీఅఎవ ఔష్వతీష్త్రశీబంవ జశీశీజూవతీం) 1,500మంది అమెరికా ఉద్యోగులను తొలగించింది. రిటైల్, మీడియా (ఉదా., డిస్నీ, సిఎన్ఎస్), బయోటెక్ /ఫార్మా రంగాలు కూడా ఆర్థిక ఒత్తిళ్లు, కృత్రిమ మేధస్సు (ఎఐ) ఏకీకరణ, వ్యూహాత్మక మార్పుల కారణంగా విస్తృతమైన కోతలను చవిచూశాయి. వీడియో గేమ్ పరిశ్రమ 2022 నుండి 2025 మధ్యకాలం వరకు 35,000 కంటే ఎక్కువ ఉద్యోగాలను కోల్పోయింది. 2025 మొదటి ఐదు నెలల్లో అమెరికాలోనే దాదాపు 7,00,000 ఉద్యోగాలు పోయాయి. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 80% పెరుగుదలను సూచిస్తుంది. 2025లో కూడా టెక్ లేఆఫ్ బలంగా ఉంది, 2024తో పోలిస్తే ఎక్కువ ఉద్యోగాల తగ్గింపు ధోరణిని కొనసాగిస్తోంది. స్వతంత్ర ట్రాకర్ లేఆఫ్స్ ప్రకారం, గత సంవత్సరం 549 కంపెనీలలో 1,50,000 కంటే ఎక్కువ టెక్ ఉద్యోగాలు తొలగించబడ్డాయి. 2025లో ఇప్పటివరకు 22,000 కంటే ఎక్కువ టెక్ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోయారు, ప్రతి నెలా తొలగింపులు జరుగుతున్నాయి. జనవరిలో 2,403 మంది, ఫిబ్రవరిలో 16,234 మంది, మార్చిలో 8,834 మంది, ఏప్రిల్‌లో 24,500 మంది, మేలో 10,397 మంది, జూన్‌లో 1,606 మంది, జులైలో 16,142 మంది ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటనలు ఉన్నాయి. ఈ వివరాలు టెక్ రంగంలో కొనసాగుతున్న అస్థిరతను నొక్కి చెబుతున్నవి. ఆకస్మిక తొలగింపులు ఉద్యోగులకు మాత్రమే కాకుండా చాలా విస్తృతమైన పరిణామాలను కలిగి ఉంటాయి. తరచుగా కార్మికులకు ఆర్థిక అస్థిరత, ప్రయోజనాల నష్టం ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. కెరీర్ అంతరాయాలు సర్వసాధారణం. ముఖ్యంగా విస్తృతమైన కోతలను ఎదుర్కొంటున్న పరిశ్రమలలో, వ్యక్తులు తక్కువ జీతం లేదా సంబంధం లేని ఉద్యోగాలలోకి బలవంతంగా పంపబడతారు. కంపెనీలు కూడా తమంతట తాముగా ప్రతిష్ఠకు నష్టం, ఉత్పాదకత కోల్పోవడం, మిగిలిన సిబ్బందిలో తక్కువ నైతికత, చట్టపరమైన సమస్యలను ఎదుర్కోవచ్చు. విస్తృత స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు అధిక నిరుద్యోగానికి, వినియోగదారుల ఖర్చు తగ్గడానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థలకు హాని కలిగించడానికి దోహదం చేస్తాయి. ఫలితంగా మార్కెట్ అస్థిరత కూడా ఉండవచ్చు, సామాజికంగా ఉద్యోగుల తొలగింపులు అసమానతను తీవ్రతరం చేస్తాయి. ప్రజల నమ్మకాన్ని తగ్గిస్తాయి. బలమైన కార్మిక రక్షణలు, నియంత్రణ సంస్కరణల కోసం ఆందోళనలు రేకెత్తిస్తాయి. 2025లో భారతదేశం ముఖ్యంగా టెక్, స్టార్టప్ సమాచారం, సాంకేతికత (ఐటి) సేవల రంగాలలో గణనీయమైన తొలగింపులను చవిచూసింది. ప్రపంచ ఆర్థిక ఒత్తిళ్లు, ఎఐ ఆధారిత ఆటోమేషన్, నిధుల కొరత కార్పొరేట్ పునర్నిర్మాణం కారణంగా ఇది జరిగింది. సమాచారం, సాంకేతికత (ఐటి), సాఫ్ట్‌వేర్ సేవలలో, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) 12,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది -ఇది ఇప్పటివరకు అతిపెద్ద తగ్గింపు అయితే ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా, హిందుస్తాన్ కంప్యూటర్స్ లిమిటెడ్ (హెచ్‌ఎల్‌సి) సంస్థలు టెక్ మార్జిన్ ఒత్తిళ్లు, ప్రపంచ ఒప్పందాలను ఆలస్యం చేయడం వల్ల నియామకాలను తగ్గించాయి లేదా సిబ్బందిని తొలగించాయి. పునర్నిర్మాణంలో భాగంగా కాగ్నిజెంట్ ఇండియా కూడా మిడిల్-మేనేజ్‌మెంట్ నియామకాలను తగ్గించింది. ప్రధాన నిధుల కొరతను ఎదుర్కొంటున్న స్టార్టప్ వ్యవస్థ ఆగస్టు 2025 నాటికి 17,000 కంటే ఎక్కువ తొలగింపులను చూసింది. బైజుస్, ఓలా ఎలక్ట్రిక్, జొమాటో (బ్లింకిట్), ఉడాన్, మీషో, షేర్‌చాట్, అనాకాడెమీ వ్యాపార పునర్వ్యవస్థీకరణ కారణంగా ఉద్యోగ కోతలు విధించాయి. ఫిన్‌టెక్‌లో, పెటిఎం, రేజర్‌పే, ఫోన్‌పే ముఖ్య కార్యకలాపాలు, బ్యాకెండ్లలో సిబ్బందిని తొలగించాయి. వీటిని తరచుగా ఎఐ భర్తీ చేసింది. రిటైల్, ఇ- కామర్స్‌లో, రిలయన్స్ రిటైల్, ఫ్యూచర్ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఇండియా వంటి సంస్థలు విస్తృత ఖర్చు, వ్యూహాత్మక సర్దుబాట్లలో భాగంగా బ్యాకెండ్ నియామకాలను నిశ్శబ్దంగా తగ్గించాయి. ఆర్థిక అనిశ్చితి, తరచుగా కార్పొరేట్ పునర్నిర్మాణాలు జరిగే సమయాల్లో, ఉద్యోగులు తమ వృత్తిపరమైన భవిష్యత్తును కాపాడుకోవడానికి చురుకైన కెరీర్ రక్షణ వ్యూహాలను అవలంబించడం చాలా అవసరం. ముఖ్యంగా, ఎఐ, సైబర్ సెక్యూరిటీ, క్లీన్ టెక్, డీప్ టెక్ వంటి అధిక- వృద్ధి రంగాలు చురుకుగా నియామకాలను కొనసాగిస్తున్నాయి, శిక్షణ, కెరీర్ పరివర్తనకు ఆశాజనకమైన మార్గాలను అందిస్తున్నాయి.

### రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
### అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
### నీట మునిగిన 200 ఎకరాల పంట
### సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
### నదిలో చిక్కుకున్న గొర్రెలను కాపాడిన ఎన్డీఆర్ఎఫ్

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీగా కురిసిన వర్షాలు ఉమ్మడి మెదక్ జిల్లాను అతలాకుతలం చేశాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో అత్యధికంగా 23.5 సెంటిమీటర్ల వర్షం కురిసింది. కుండపోత వర్షానికి గౌరారంలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్గల్, ములుగు, గజ్వేల్ ప్రాంతాల్లో చెరువు కుంటలు పొంగి పొరడడంతో వర్షం నీరు రహదారులపై చేరి రాకపోకలకు కొంతసేపు ఇబ్బంది ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు పూర్తిగా నీటమునిగాయి. వాగుల ఉద్ధృతికి పలుచోట్ల రహదారులు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ట మునిగిన 200 ఎకరాల పంటదుబ్బాక మండలంలోని కూడవెల్లి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గజ్వేల్ శివారులోని హల్దీ వాగు ఉప్పొంగుతోంది. శివ్వంపేట మండలం పాంబండ వద్ద నిర్మించిన రహదారి కొట్టుకుపోయింది. హల్దీ ప్రాజెక్టు ఉద్ధృతితో కొప్పులపల్లి-హకీంపేట మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్సాపూర్ మండలం కాజీపేట గ్రామంలోని మోతుకులకుంటకు భారీగా వరద చేరగా అధికారులు గండికొట్టి నీటిని దిగువకి విడుదల చేస్తున్నారు. శివ్వంపేట, నరసాపురం మండలంలో చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. అల్లాదుర్గంలో బట్టికుంట చెరువు కట్ట తెగడంతో దాదాపు 200 ఎకరాల్లో పంటనీట మునిగింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం

దాతర్‌పల్లిలో కట్టు కాల్వ తెగిగ్రామం నుంచి వర్షపునీరు ప్రవహించింది. తూప్రాన్‌లో పలు కాలనీలు జలమయం అయ్యాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వాసర్ వాగులో వరద ఉధృతికి కారు కొట్టుకు పోయింది. అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మేడ్చల్ నుంచి గౌడవెల్లి రోడ్డుపై వాగు ఉద్ధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి వద్ద వాగు ఉదృతంగా ప్రవహిస్తోంది. ప్రజలు ఎవరూ అటు వైపు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. లక్ష్మాపూర్ అలుగు పారి ఉదృతంగా ప్రవహిస్తోంది. పోలీసులు వాగుల వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు.

నారాయణపేట జిల్లాలో కురుస్తున్న వర్షాలకి, వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండారెడ్డిపల్లి చెరువు మత్తడి పోస్తోంది. జిల్లా కేంద్రంలోని వాగు ఉద్ధృతికి ఊట్కూరు మండలంలోని అమీన్ పూర్, పగిడిమారి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు మంగపేటలోని రోడ్లు, పలు కాలనీలు జలమయమయ్యాయి. మంచిర్యాలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జోరువానలకు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సురక్షిత ప్రాంతాలకు తరలింపు :

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు ముంచెత్తాయి. ఏజెన్సీ మండలాలు వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయిలో వర్షాలు దంచికొట్టాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వర్షం కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లి సింగరేణి డివిజన్ లోని కాకతీయ ఖని-2, 3 ఉపరితల గనుల్లో ఒక షిఫ్టు నడిచే పరిస్థితి లేక బొగ్గును తరలించే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో బొగత ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఏటూరునాగారం-కమలాపూరం మధ్య జీడివాగు ఉద్ధృతి పెరిగింది. పలు చోట్ల ఇళ్లలోకి భారీగా నీరు చేరడంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాలకు తాడ్వాయిలో మహిళ మృతి చెందింది. వరద బాధిత ప్రాంతాలతో పాటు మేడారంలో జంపన్నవాగు, రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద ఉద్ధృతిని మంత్రి సీతక్క పరిశీలించారు. భారీవర్షాలు కురుస్తున్నందున ప్రజలు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కారుణ్య నియామకాల క్రింద ఇద్దరికీ జూనియర్ అసిస్టెంట్ గా నియమక పత్రాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందచేశారు.





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, ఆగస్టు 28 : సమాచార పౌర సంబంధాల శాఖలో కారుణ్య నియామకాల క్రింద ఇద్దరికీ జూనియర్ అసిస్టెంట్ గా నియమక పత్రాలను రాష్ట్ర రెవిన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందచేశారు. టి.రోహన్ కుమార్ కు Dy.EIE, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా కుమారి ఎస్.ప్రియాంక కు RJD Multi Zone-2 లో జూనియర్ అసిస్టెంట్ గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ రోజు సచివాలయంలో కారుణ్య నియామకాల పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి. హెచ్.ప్రియాంక పాల్గొన్నారు

## భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాలపై ప్రాథమిక నివేదికను సమర్పించండి - సి.ఎస్ రామ కృష్ణారావు

### వివిధ శాఖల కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్



హైదరాబాద్, ఆగస్టు 28 :రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో నేడు సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్ , పోలీస్ శాఖ %ణ+ూ% మరియు అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సి.ఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖ కు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్ -గ్రేషియా ను అందచేయాలని అన్నారు. ముఖ్యమంత్రి పూర్తి స్థాయిలో సమీక్షించనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

## మాసబ్ ట్యాంక్‌లో చేప రైతుల అర్ధనగ్న ఆందోళన




**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్: మాసబ్ ట్యాంక్ మత్స్య భవన్ వద్ద చేప రైతులు అర్ధనగ్న ఆందోళనకు దిగారు. గత రెండు సంవత్సరాలుగా తాము సరఫరా చేసిన చేపల బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తెలిపారు %- 2023-%24 ఆర్థిక సంవత్సరానికి రూ.75 కోట్లు, 2024%-%25కి మరో రూ.34 కోట్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని. అయితే ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా అందలేదని వారు ఆరోపించారు. "రైతుల ప్రభుత్వమని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మా సమస్యలపై ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. చేపల ఉత్పత్తిలో తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చినా, ఆ చేపల పంపిణీ చేసిన రైతులు మాత్రం బకాయిల కోసం బతుకులాట పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని, లేని పక్షంలో పిల్ల జల్లతో భారీ ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వం, అధికారులను హెచ్చరించారు.. బైట్: గుర్రాల మల్లేశం (తెలంగాణ మత్స్య రైతుల ఉత్పత్తి అసోసియేషన్ ప్రెసిడెంట్). బైట్: మల్లేశం ముదిరాజ్ గోపాల్ ముదిరాజ్ (మత్స్య రైతు

# భారత హాకీ మాంత్రికుడు

ధ్యాన్ చంద్ (1905, ఆగస్టు 29 %-% 1979, డిసెంబరు 3) సాటిలేని భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందిం చడంతో పాటు, ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. భారత దేశానికి హాకీలో స్వర్ణ యుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఖేల్ రత్న అవార్డు ఇస్తారని చాలా మందికి తెలుసు. ఈ ఖేల్ రత్న అవార్డు నిన్నటి దాకా రాజీవ్ ఖేల్ రత్నగా పిలవబడగా.. ధ్యాన్ చంద్ సేవలకు, దేశ భక్తికి గుర్తింపుగా దాని పేరు ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మార్చింది. హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే దేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపు కుంటు న్నారు. దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్ చంద్ గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవచ్చు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మించారు. మెరుపు వేగంతో గేల్స్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. మైదానంలో పాదరసంలా కదిలిపోతూ బంతిని పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడంలో ఆయనకు ఎవరూ సాటిరారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందించడంతో పాటు,ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 29 ఆగస్ట్ 1922న తన 17వ పుట్టినరోజున చంద్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సిపాయిగా చేరాడు. ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత పురుషుల హాకీ జట్టు మూడు సార్లు ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ పతకాలు సాధించింది. 1928 ఆమ్‌స్టర్ డామ్,1932 లాస్ ఏంజిలెస్,1936 బెర్లిన్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు బంగారు పతకాలు అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కింది. చంద్రుడి వెలుతురు లోనూ ఆయన ప్రాక్టీస్ చేసేవారు. అందుకే ఆయన్ను ముద్దుగా చంద్‌గా పిలిచేవారు. 1936నాటి ఒలంపిక్స్ సందర్భంగా బెర్లిన్‌లో పెద్ద ఎత్తున ధ్యాన్ చంద్ పోస్టర్లు వెలిశాయి. ధ్యాన్ చంద్ ఆట చూసేందుకు స్టేడియంకు రావాలంటూ ఆయన ఫ్యాన్స్ ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ ఒలంపిక్స్ హాకీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జర్మనీతో తలపడింది. ఆ ఫైనల్ మ్యాచ్ లో భారత్ 16-1 తేడాతో జర్మనీని మట్టి కరిపించింది. భారత్ పక్షాన ధ్యాన్ చంద్ 15 గోల్స్ చేసి చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్‌లో ద్వితీయార్థంలో ధ్యాన్ చంద్..తన షూ, సాక్స్‌ను తీసేసి మ్యాచ్ ఆడారు. అయినా మూడు గోల్స్ సాధించి ఔరా అనిపించే ఆట ప్రదర్శించారు. ఆ సమయంలో స్టేడియంలో దాదాపుగా 25 వేల మంది ప్రేక్షకులతో పాటు గొప్ప నియంతగా పేరొందిన ఎడల్ఫ్ హిట్లర్ కూడా ఆ మ్యాచ్ ని తిలకించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ధ్యాన్ చంద్ వద్దకి వచ్చిన హిట్లర్ తన సహచరులతో "అతడి హాకీ స్టిక్ విరగ్గొట్టి చూడండి.. అందులో తప్పకుండా ఏదో అయస్కాంతం ఉండి ఉంటుంది లేకపోతే ఇలా ఎలా ఆడతాడు" అని హాకీ స్టిక్ విరగ కొట్టగా ఎలాంటి అయస్కాంతమూ దొరకలేదు. దాంతో కంగుతిన్న హిట్లర్ అదేరోజు రాత్రి ధ్యాన్ చంద్ ని తన వద్దకు పిలిపించుకొని హాకీ ఆట కాకుండా నువ్వు ఏమేమి చేస్తావని ధ్యాన్ చంద్ ని అడగగా "నేను ఆర్మీలో సుబేదార్ గా పని చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. హిట్లర్ "ధ్యాన్ చంద్, నీ దేశము నీకేమిచ్చింది..? ఈరోజుకు నువ్వు కేవలం సుబేదార్ వి. జర్మనీ హాకీ జట్టు తరపున ఆడితే తక్షణమే నిన్ను ఎయిర్ ఫీల్డ్ మార్షల్ గా నియమిస్తానని చెప్తూతుండగా...తమరు ఎన్ని పదవులు ఇచ్చినా, ఎంత డబ్బు ఇచ్చిన నేను నా దేశానికి మాత్రమే ఆడుతాను. పరాయి దేశాలకోసం ఆడను.." అని తెగేసి చెప్పగానే హిట్లర్ నిర్ఘాంతపోయి తలదించు కున్నట్లు చెపుతారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడ వలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు. ఓ మ్యాచ్ సందర్భంగా ధ్యాన్ చంద్ ప్రత్యర్థులపై ఒక్క గోల్ కూడా చేయలేక పోయారు. గోల్ పోస్ట్ విషయంలో రిఫరీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరిశీలనలో గోల్ పోస్ట్ అంతర్జాతీయ ప్రమా ణాలకు అనుగుణంగా లేనట్లు రుజువు అయింది. 1926 నుండి ఆయన 185 మ్యాచ్ ల్లో 570 గోల్స్ చేసి 1949 వరకు అంతర్జా తీయంగా ఆడారు. 2002లో ఢిల్లీలోని నేషనల్ స్టేడియంకు ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంగా నామకరణం చేశారు. అలాగే అలిఘడ్ ముస్లిం యూని వర్సిటీలోని ఓ హాస్టల్‌కు ఆయన పేరు పెట్టారు. లండన్‌లోని ఇండి యన్ జింకానా క్లబ్‌కు ధ్యాన్ చంద్ పేరు పెట్టారు. ధ్యాన్ చంద్ పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేసి భారత ప్రభుత్వం గౌరవించింది. ఇప్పటి వరకు ఆ గౌరవాన్ని పొందిన ఏకైక భారత హాకీ క్రీడాకారుడు ఆయనే. 34 సంవత్సరాల సేవ తర్వాత, ఆయన 29 ఆగస్టు 1956న భారత సైన్యం నుండి లెఫ్టినెంట్ (యాక్టింగ్ కెప్టెన్ ) గా పదవీ విరమణ చేశారు . భారత ప్రభుత్వం అదే సంవత్సరం ధ్యాన్ చంద్ కు భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కా రమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది.

## పార్టీ విస్తరించేది ఎలాగా..

విజయవాడ, ఆగస్టు 28, ఆంధ్రప్రదేశ్ లో జనసేన పార్టీ కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల పరిస్థితులు వేరు. 2029లో జరగబోయే పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఎందుకంటే 2024కు ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నడూ అధికారంలో ఉండలేదు. అదే సమయంలో ఆయనపై జనంలో కూడా బాగా హోప్స్ ఉన్నాయి. పవన్ కల్యాణ్ నీతి మంతుడు. నిజాయితీ పరుడు. రాజకీయాల్లో అవినీతి చేసి డబ్బులు సంపాదించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ అదే నిజం. ఎందుకంటే ఆయన సినిమాల ద్వారానే తన ఆదాయాన్ని సంపాదించుకుంటారు. ఒక్క సినిమా చేస్తే చాలు పార్టీని ఏడాది పాటు నడపటానికి అవసరమైన డబ్బులు సమకూరుతాయి. అందులో పవన్ కల్యాణ్ కు, రాజకీయ నేతలకు మధ్య చాలా తేడా ఉంది. ఏదో చేయాలని మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారు. వారసత్వంగానో లేక రాజకీయాల్లో పదవులు సంపాదించుకుని సొమ్ములు మూటగట్టుకుందామన్న ధ్యాస కూడా లేదు. తాను ఫీలయితే సొంత డబ్బులు అయినా ఇచ్చి ఆ సమస్యకు పరిష్కారం చూపడంలో ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ముందుంటారు. అటువంటి పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో కీలకంగా మారారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా జోడీ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తుందని ఆశించారు. అయితే అనేక కారణాలు ఆయన కాళ్లకు బ్రేకులు వేశాయనే చెప్పాలి.ఎందుకంటే గత పధ్నాలుగు నెలల నుంచి పవన్ కల్యాణ్ తనకు బాధ్యత అప్పటించిన మంత్రిత్వ శాఖలో విజయం సాధించినప్పటికీ, ఉప ముఖ్యమంత్రిగా మాత్రం ఆశించిన రీతిలో పనితీరు లేదన్నది ప్రజాభిప్రాయంగా వినిపిస్తుంది. ఏ విషయంలోనూ కూటమి ప్రభుత్వంలో తీసుకుంటున్న నిర్ణయాలు తప్పని చెప్పే పనికి దూరంగా ఉంటుండటంతో కొంత పవన్ ఇమేజ్ రాజకీయంగా డ్యామేజీ అయిందనే చెప్పాలి. అయితే పవన్ కల్యాణ్ అంటే నేటికీ అభిమానమున్న జిల్లాలు కొన్ని మాత్రమే మిగిలి ఉన్నాయి. అక్కడ కూడా 2024 ఎన్నికల కంటే ముందున్న పరిస్థితులకు భిన్నంగా మారాయి. అయినా రెండు జిల్లాల్లోనే నేటికీ పవన్ కల్యాణ్ పార్టీ బలంగా ఉండటంతో మిగిలిన జిల్లాల్లో బలహీనంగా ఇప్పటికీ కొనసాగుతుండటంతో రానున్న ఎన్నికల నాటికి పవన్ రంగంలోకి దిగి మార్చకపోతే మరింత దిగజారే అవకాశాలున్నాయన్నది సుస్పష్టం.జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో జనసేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన వేలాది మంది కార్యకర్తలు హాజరుకానున్నారని సమాచారం. ఈ సమావేశం ద్వారా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ బలోపేతం కోసం పవన్ ఎలాంటి సూచనలు చేయనున్నారు, కూటమి ప్రభుత్వ ఏర్పాటులో తమ పాత్రపై చెబుతారా అన్నది ఆసక్తి పెంచుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కేడర్ బలోపేతం కోసం పవన్ యాక్షన్ ప్లాన్ ఏంటన్నది ఈ సమావేశాలతో క్లారిటీ రానుంది

## ఆలోపతితో పాటు.. ఇతర వైద్య సేవలు

అనంతపురం, ఆగస్టు 28 ఏపీలో ఆయుష్ వైద్య సేవలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని ఆరోగ్యశాఖా మంత్రి సత్య కుమార్ అన్నారు. ఆయుర్వేద, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆసుపత్రులను కొత్తగా ఏర్పాటుచేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోనే తొలి నేచర్ క్యూర్ వైద్య కళాశాల వైజాగ్ లో రాబోతుంది. ఇందులో 2026?27 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయి. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు సిద్ధమవుతున్నాయి. అలాగే... విశాఖ నగరంలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగ శాల కూడా రాబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం.. 2016?17లో నేచర్ క్యూర్ ఆసుపత్రి (ప్రకృతి వైద్య కళాశాల), రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చూపుతున్న చొరవతో కాకినాడ ఆసుపత్రికి రూ.7.17 కోట్లు, విశాఖలో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రికి రూ.4.18 కోట్లు, నేచర్ క్యూర్ వైద్య కళాశాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయని వైద్య శాఖ ప్రకటన రిలీజ్ చేసింది. కేంద్రం నుంచి మూడు సంవత్సరాల తరువాత నిధుల విడుదల అవుతున్నాయనీ దీనివల్ల ఆయుష్ వైద్య సేవలు మెరుగుపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ అన్నారువిశాఖలోని విమ్స్ ప్రాంగణంలో రూ.16.40 కోట్లతో చేపట్టిన నేచర్ క్యూర్ వైద్య కళాశాలలో 2026?27 విద్యా సంవత్సరం నుంచి బ్యాచులర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్ (బీఎన్వైఎస్) కోర్సులో తరగతులు ప్రారంభంకానున్నాయి. బీఎన్ వైఎస్ కోర్సులో 50 సీట్ల భర్తీకి కేంద్రం ఆమోదం తెలుపనుంది. ఈ కళాశాల పక్కనే.. రూ.14.85 కోట్ల వ్యయంతో 50 పడకలతో చేపట్టిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి నిర్మాణపనులు కూడా పూర్తయ్యేద శలో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ప్రజలకు త్వరలోనే అందుబాటులోనికి వస్తాయి. వీటి ఆధారంగా కేంద్రం అడ్మిషన్స్ కు అనుమతి ఇస్తునీది. గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ అయినందున అడ్మిషన్స్ త్వరగా స్టార్ట్ చేయడానికి వెసులుబాటు ఉంది.నేచర్ క్యూర్ వైద్య కళాశాల ఏర్పాటుకు తగ్గట్లు ప్రత్యేకంగా నేచర్ క్యూర్ ఆసుపత్రి ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 50 పడకలతో ఈ ఆసుపత్రి ఏర్పాటుపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. సుమారు రూ.16 కోట్లు కేంద్రం నుంచి రానున్నాయి.విశాఖలోని శొంఠ్యాం ప్రాంతంలో సుమారు రూ.6 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబరోరేటరీల భవన నిర్మాణాలు పూర్తికావొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సుమారు రూ.5 కోట్లతో పరికరాలు, యంత్రాలు, ఇతర వాటి కొనుగోళ్ల ప్రక్రియ జరగనుంది.కాకినాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 50 పడకలతో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ఇక్కడ ప్రారంభించేందుకు వీలుగా అవసరమైన వైద్య పరికరాలు, యంత్రాల కొనుగోళ్లు జరుగుతున్నాయి. మూడు నెలల్లోగా ఈ ఆసుపత్రి సేవలు ప్రజలకు అందుబాటులోనికి రానున్నాయి.నేషనల్ ఆయుష్ మిషన్ కింద కాకినాడలో ఆయుర్వేద వైద్య కళాశాల, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటుఆమోదం కోసం కేంద్ర ఆయుష్ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ వెల్లడించారు. ధర్మవరంలో ఆయుర్వేద కళాశాలకు అనుబంధంగా ఉండాల్సిన ఆయుర్వేద ఆసుపత్రిని 50 పడకలతో ఏర్పాటుచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. మంత్రి సత్యకుమార్ ధర్మవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

### పెద్దిరెడ్డికి షాక్...

తిరుపతి, ఆగస్టు 28,ఏపీ ప్రభుత్వం సంచలనం నిర్ణయ తీసుకుంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధవ రెడ్డికి షాకిచ్చింది. ఆయన వలసపల్లెలో ఎసైన్డ్ భూములను ఆక్రమించారని, నిషేధిత జాబితాలోని భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చర్యలు తీసుకున్నారు. మాధవ రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని కలెక్టర్ గుర్తించారు.. జూన్ 25న విచారణకు ఆదేశించారు. విచారణలో కొన్ని విషయాలు బయటపడ్డాయి.మాధవ రెడ్డి కుమారుడు వంకిరెడ్డి మోనిష్‌కుమార్‌రెడ్డి పేరు మీద 3.34 ఎకరాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు విచారణల తేలింది. ఇది సర్వే నెంబర్ 546/1లో జరిగింది.. అలాగే సర్వే నెంబర్ 546/2లో 5.38 ఎకరాలను మాధవ రెడ్డి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అక్కడ కల్యాణ మండపం, హోటల్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయాలన్నీ విచారణలో తేలాయని కలెక్టర్ తెలిపారు. ఈ భూములను అప్పటి కలెక్టర్ అనుమతి లేకుండానే ఫ్రీహోల్డ్ చేశారని, ఆఖ పట్టా షరతులను ఉల్లంఘించారని విచారణలో తేలిందట. 'రద్దు చేసిన రిజిస్ట్రేషన్ భూముల వివరాలను నిషేధిత ఆదేశాల పుస్తకంలో నమోదు చేయాలి' అని మదనపల్లె మండల తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

## ఆడారికి కీలక పదవి
## తెలుగు తమ్ముళ్ల ఫైర్

విశాఖపట్టణం, ఆగస్టు 28, అడారి ఆనంద్ కుమార్.. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు. కాషాయ కండువా కప్పుకున్న ఆరు నెలల్లోనే? అది కూడా ఎలాంటి సంఘ్ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా రాష్ట్ర స్థాయి కీలక పదవి లభించడం కమలదళంలో కొత్త ట్రెండ్. ఇప్పుడీ పరిణామం బీజేపీ కంటే టీడీపీ వర్గాల్లోనే ఆసక్తికరమైన చర్చకు తెరతీసింది. కారణం, రాజకీయంగా చెక్ పెట్టేందుకు జరిగిన ప్రయత్నాలను లాబీయింగ్ ద్వారా తిప్పికొట్టడంలో ఆనంద్ సక్సెస్ అవ్వడమేనంటున్నారు. టీడీపీతో ఆడారి ఫ్యామిలీది మూడున్నర దశాబ్దాల అనుబంధం. ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాలు విజయ విశాఖ కో ఆపరేటివ్ డెయిరీ చుట్టూ తిరుగుతుంటాయి. ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేసేది టీడీపీ హైకమాండ్ అయినా తెరవెనుక వ్యూహాలను అమలు చేసి పార్టీకి విజయాలను అందించడంలో విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ అడారి తులసీరావుది కింగ్ మేకర్ ఇమేజ్. మాడుగుల, చోడవరం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో రైతులు, పాల డెయిరీ సంఘాలతో ఉన్న నెట్ వర్క్ కారణంగా? అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే స్థాయిలో ఆయన లాబీయింగ్ చేసేవారనేది టీడీపీ వర్గాల టాక్. ఈ కారణంతోనే డెయిరీ వ్యవహారాలపై వచ్చిన ఆరోపణల మీద 2004 ? 2009 మధ్య అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ నిర్వహించింది.అయితే, ఆ నివేదికలు., యా జమాన్యంపై తీసుకున్న చర్యలు బహిర్గతం కాకపోగా అసలు చర్చల్లోకి రావడం మానేసి చాలా కాలం అయింది. ఈ పరిస్థితుల్లో.. 2019ముందు తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ పాలిటిక్స్ ప్రారంభించారు తులసీరావు కుమారుడు అడారి ఆనంద్ కుమార్. తండ్రి కేవలం తెర వెనక రాజకీయం చేయగా.. ఆనంద్ మాత్రం ఆన్ స్క్రీన్ ఎంటరైపోయారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ సీట్లో టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారాయన. రాజకీయ కుటుంబం, సామాజిక, ఆర్థికంగా పటిష్టంగా ఉండటంతో ఆనంద్‌పై ఆఖరి నిముషంలో అభ్యర్థిని మార్చి కొత్త స్కెచ్ వేసి సక్సెస్ అయింది వైసీపీ. అనూహ్యంగా గవర సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సత్యవతి అభ్యర్థిగా నిలిపిన ఫ్యాన్ పార్టీ భారీ విజయం నమోదు చేసింది. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చాక కుటుంబ పాలనగా వున్న విజయ విశాఖ డెయిరీపై పాలకవర్గం మీద దృష్టి సారించిందనే ప్రచారం జరిగింది.ఆ ప్రచారం నడుమే.. ఎవ్వరూ ఊహించని విధంగా.. వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు ఆనంద్. తండ్రి టీడీపీకి స్టాండ్ అయితే కుమారుడు వైసీపీలో యాక్టివ్ పాలిటిక్స్ మొదలెట్టారు. గ్రేటర్ విశాఖపై పట్టు బిగించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ.. 2024 ఎన్నికల్లో విశాఖ పశ్చిమ నియోజకర్గంపై ఫోకస్ పెట్టింది. ఆ క్రమంలో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గణబాబుపై పోటీ చేసిన ఆనంద్.. బలమైన అభ్యర్థిగా ప్రొజెక్ట్ అవ్వడంతో ఫలితాలు వచ్చే వరకు ఉత్కంఠ కొనసాగింది. కానీ, కూటమి వేవ్, వైసీపీ అంతర్గత రాజకీయాలు కారణంగా ఆనంద్ ఓడిపోయినట్టు చెప్పుకుంటారు. దీంతో ఆయన యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరం అవుతారని, వ్యాపారాలపైనే దృష్టి సారిస్తారనే ప్రచారం జరిగింది. అందుకు తగ్గట్టుగానే కొన్ని నెలలు కామ్‌గా ఉన్నారు అడారి. అదే సమయంలోలో కూటమి పార్టీలు కీలక ఆరోపణలను తెరపైకి తెచ్చాయివిశాఖ డెయిరీ నిధులు గోల్ మాల్ అయ్యాయని, కుటుంబ పాలన కారణంగా నష్టం జరుగుతోందని, పాడి రైతుల కష్టానికి ఫలితం లేకుండా పోతోందని ఆరోపించింది టీడీపీ. డెయిరీ యాజమాన్యం ప్రభుత్వ భూమిని కలిపేసుకుందంటూ జనసేన మరో విషయాన్ని బయటపెట్టింది. ఈ పరిణామాలన్నిటి మధ్య? విచారణ కోసం శాసనసభ లో పట్టుబట్టింది టీడీపీ. దీంతో విచారణకు హౌస్ కమిటీని నియమించారు స్పీకర్ అయ్యన్న పాత్రుడు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నేతృత్వంలోని కమిటీ క్షేత్ర స్థాయి పర్యటన జరిపి.. అసలు వచ్చిన ఫిర్యాదుల కంటే ఎక్కువ, ఇంకా తీవ్రమైన అవకతవకలు జరిగినట్టు అభిప్రాయపడింది. లెక్కలు తీసేందుకు సాంకేతిక సహకారం కూడా అవసరమని భావించింది. దీంతో విశాఖ డెయిరీలో అడారి ఫ్యామిలీ హవా ముగిసినట్టేనన్న ప్రచారం మొదలైంది. కీలకమైన డైరెక్టర్లు టీడీపీలోకి జంప్ అయిపోవడంతో డెయిరీ పాలిటిక్స్ ఆసక్తికరంగా కనిపించాయిఈ వ్యూహాలను ఆనంద్ ఎలా ఎదుర్కొంటారన్న చర్చ జరుగుతుండగానే మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారాయన. అనూహ్యంగా బీజేపీ తీర్థం పుచ్చేసుకోవడం?..దానికి పార్టీ ముఖ్య నాయకత్వం నుంచి పూర్తిస్థాయి సానుకూలత వ్యక్తం కావడం ఆసక్తికర పరిణామం. కేవలం డెయిరీ మీద పట్టు నిలబెట్టుకోవడం కోసమే ఆనంద్ సేఫ్ గేమ్ ఆడారన్న అభిప్రాయం వ్యక్తం అయింది. అదలా ఉండగానే? ఇప్పుడు అడారికి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్ష పీఠం లభించింది. ఇది కూటమిలో ప్రధాన భాగస్వామిగా వున్న తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఊహించనిది. ఇప్పుడు కూడా టీడీపీ నాయకులు అడారి అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడతారా? మిత్రపక్షం రాష్ట్ర ఉపాధ్యక్షుడి మీద విచారణ కోరతారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పుడు హౌస్ కమిటీ విచారణ ఎంత సమర్ధవంతగా ముందుకు వెళుతుందన్నది బిగ్ క్వశ్చన్. అడారి ఎత్తును టీడీపీ చిత్తు చేస్తుందా? లేక మన కూటమిలోకి వచ్చేశాడు కదా అని సర్దుకుపోతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## అందరూ మిత్రులే...

విజయవాడ, ఆగస్టు 28, ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఒకరు మద్దతిస్తే, మరొకరు వ్యతిరేకిస్తారు. కానీ ఏపీ రాజకీయాల తీరు వేరు. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఇక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు కేంద్రంలో ఉండే బీజేపీ వైపు నిలుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీ నేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ కూడా కేంద్రంలో ఉన్న బీజేపీకి అనేక సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. ఇక నాడు ప్రారంభమయిన దోస్తీ నేటి వరకూ కొనసాగుతూనే ఉంది. 2014లో కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీలు తర్వాత విభేదాలతో విడిపోయాయి. ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో నాడు బీజేపీని వ్యతిరేకించిన చంద్రబాబు దాదాపు ఐదేళ్లు ఢిల్లీకి వెళ్లలేదు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ పట్ల టీడీపీ సాఫ్ట్ కార్నర్ గా వ్యవరిస్తూ వచ్చింది. అంతేకాదు టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు నలుగురు బీజేపీలోకి వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి నాడు అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతిస్తూ వస్తుంది. 2018 లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్న టీడీపీ చివరకు 2019 లో ఫలితాల తర్వాత మాత్రం తిరిగి బీజేపీకి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. 2024లో తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీలు కలసి పోటీ చేసి అధికారంలోకి రాగలిగాయి ఇక గత పదేళ్ల నుంచి ఏ ఎన్నికలో ఏ ఫలితం వచ్చినప్పటికీ, అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అవసరమైన సమయంలో టీడీపీ, వైసీపీలు నేరుగానే మద్దతు ప్రకటిస్తూ వస్తున్నాయి. ఒరకంగా చూడాలంటే టీడీపీ, వైసీపీలు రెండూ బీజేపీని శత్రువుగా చూడటం లేదు. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ కు మాత్రం దగ్గరయ్యే ప్రయత్నం చేయడం లేదు. అందుకే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ, అలాగే కేంద్ర ప్రభుత్వం ఆమోదించే ప్రతి బిల్లును కూడా సమర్థించే పరిస్థితులు వచ్చాయి. అందుకే ఆంధ్రప్రదేశ్ లో బీజేపీకి శత్రుపార్టీ అంటూ ఏమీ లేదు. అందరూ మిత్రులే. అదే పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో మాత్రం ఇటు ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్, అటు జాతీయ పార్టీ కాంగ్రెస్ వ్యతిరేకంగా ఉండగా, ఏపీలో మాత్రం భిన్నమైన రాజకీయ పరిస్థితులున్నాయి. భవిష్యత్ లోనూ ఇలాగే కొనసాగే అవకాశాలున్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సపోర్టు మాత్రం బీజేపీకి ఇవ్వడం మాత్రం ఇక్కడ రివాజుగా మారింది. తాజాగా ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ వైసీపీ మద్దతు పలకడంతో మరొకసారి ఇది చర్చనీయాంశంగా మారింది.

### సత్తుపల్లి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

ఖమ్మం, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సత్తుపల్లి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. జెవిఆర్ ఓసిలో 98 మిల్లీమిటర్లు, కిష్టారం ఓపెన్ కాస్టల్లో 160 ఎంఎం వర్షపాతం నమోదు అయింది. ఉపరితల గనులలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో జెవిఆర్, క్రిష్టారం రెండు ఓసీ లలో కలపి 50,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 2,60,000 క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులకు పూర్తిగా ఆటంకం ఏర్పడింది.నిన్న, ఈరోజు 240 హెచ్పి మోటార్లతో సహాయంతో ఓసిల్లో నీటిని తోడి బయటకు పోస్తున్నారు

# బార్ల వైపు చూడని జనం

గుంటూరు, ఆగస్టు 28, ఆంధ్రప్రదేశ్ లో కొత్త బార్ల పాలసీకి స్పందన కొరవడింది. ఆశించిన రీతిలో దరఖాస్తులు అందకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. లైసెన్సు ఫీజు భారీగా తగ్గించినప్పటికీ దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడానికి కారణాలపై ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు. నిజానికి ఏపీలో బార్ల లైసెన్స్ ల కోసం ఎప్పుడూ ఎగబడతారు. బార్లకు సమయం కూడా ప్రభుత్వం పెంచడంతో గిరాకీ పెరిగే అవకాశముంది. అత్యధిక లాభాలను ఆర్జించే అవకాశాలున్నాయి. అయినా సరే ఎందుకో గాని ఈ సారి బార్ల లైసెన్సుల కోసం దరఖాస్తులు అతి తక్కువ రావడంతో దీనిపై ఎక్సైజ్ అధికారులు కింది స్థాయి అధికారులతో మాట్లాడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 840 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈరోజుతో దరఖాస్తు గడువు ముగియనుంది. అయితే ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులు కేవలం తొంభయి మాత్రమేనని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇంత తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ వేయడం కూడా కష్టమేనని ఎక్సైజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. మద్యం వ్యాపారులు ఎక్కువ మంది ఉత్సాహం చూపడానికి గల కారణాలను అన్వేషించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు. నిజంగా ఇది ఆశ్చర్యానికి గురి చేస్తుందంటున్నారు. దీనికి ప్రధాన కారణం అధికార పార్టీ ఎమ్మెల్యేల వత్తిడి కూడా కొంత ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. అదే సమయంలో ఎనిమిది జిల్లాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆందోళనలో ఉన్నారు. అనంతపురం, కోనసీమ, అనకాపల్లి, తూర్పు గోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గుంటూరు, ప్రకాశం, విజయవాడ వంటి ప్రాంతాల్లోనూ తక్కువ దరఖాస్తులు వచ్చాయంటున్నారు. అయితే బెల్ట్ షాపులు పెరిగిపోవడంతో పాటు వైన్ షాపులనే మినీ బార్లుగా మలచి వ్యాపారాలను నిర్వహిస్తుండటంతో తాము బార్లకు లైసెన్సు ఫీజు చెల్లించి అనుమతులు పొందినా గిరాకీ రావడం కష్టమేనని భావించి వెనక్కు తగ్గి ఉంటారని అనుమానిస్తున్నారు. మరొకవైపు వ్యాపారులు సిండికేట్ అయ్యారన్న సందేహాలు కూడా ఉన్నాయి.ఎక్సైజ్ శాఖ తీసుకువచ్చిన కొత్త విధానం తమకు అనుకూలంగా లేదనీ.. దానివల్ల తమకు గిట్టుబాటు కాదని వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతీ బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామనే రూల్ పెట్టడంతో.. అదనపు ఏఆర్ఈటీ 15 శాతాన్ని తొలగించకపోవడం కూడా వ్యాపారులు లైసెన్స్‌లకు అప్లై చేసుకోకపోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. మరోవైపు.. ఇప్పటికే ఏపీలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకునేందుకు ఇటీవలె ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అంతేకాకుండా రూ.99 కి దొరికే క్వార్టర్ మద్యాన్ని బార్‌లలో అమ్మడానికి వీలు లేదనే నిబంధన కూడా తీసుకువచ్చింది.ఎన్టీఆర్ జిల్లాలో 130 బార్‌లు ఉండగా.. కేవలం 10 బార్‌లకే దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు జిల్లాలో 110కి గానూ 9 బార్‌లకు మాత్రమే 4 లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కృష్ణా జిల్లాలో 39 బార్‌లు ఉండగా.. వాటిలో ఏడింటికి.. కర్నూలు జిల్లాలో 23 బార్‌లకు 6 బార్లకు మాత్రమే 4 లేదా అంతకుమించి అప్లికేషన్లు వచ్చాయి.మొత్తం 3,332 మంది రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ.. వారంతా అప్లికేషన్ చేసుకున్నారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీసే ప్రక్రియ మొదలు అవుతుందని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్ వెల్లడించారు. వినాయక చవితి, బ్యాంకు సెలవుల కారణంగా.. అప్లికేషన్ల స్వీకరణ గడువును పొడిగించినట్లు తెలిపారు.

# కోర్టు మెట్లు ఎక్కుతున్న ఎమ్మెల్సీలు

ఏలూరు, ఆగస్టు 28, ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం మరోసారి చర్చకు వచ్చింది. ఎన్నికల ఫలితాల తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. తమ ఎమ్మెల్సీ పదవులకు సైతం రాజీనామాలు ప్రకటించారు. మండలి చైర్మన్ ఫార్మేట్లో రాజీనామా లేఖలను పంపించారు. అయితే ఏడాది అవుతున్న ఆ రాజీనామాలను ఆమోదానికి నోచుకోలేదు. దీంతో వారంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధపడుతున్నారు. అయితే తాజాగా జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయ మంగళం వెంకటరమణ.. హైకోర్టును ఆశ్రయించారు. ఏపీలో ఎమ్మెల్సీ రాజీనామా వ్యవహారం హైకోర్టుకు చేరింది. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారు. తాను గతేడాద నవంబర్ 23న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని.. ఈ మేరకు శాసనమండలి ఛైర్మన్‌కు లేఖ సమర్పించానని కోర్టుకు తెలిపారు. అయితే, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని హైకోర్టును ఆశ్రయించానన్నారు. చట్ట ప్రకారం తన రాజీనామాను ఆమోదించేలా ఆదేశించాలని కోరారు.. దీంతో అదే బాటలో మిగతా ఎమ్మెల్సీలు సైతం కోర్టుకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీలు కర్రీ పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్, మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జాకీయాఖానం రాజీనామా చేశారు. అయితే ఈ రాజీనామాలను మండలి చైర్మన్ మోసేన్ రాజు ఆమోదించడం లేదు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో బలం ఉంది. ఏవైనా బిల్లులు వస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించాలని జగన్మోహన్ రెడ్డి భావించారు. అక్కడే కూటమి కొత్త ఎత్తుగడ వేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలకు రాజీనామా చేయించి.. వారి స్థానంలో కూటమి నేతలతో ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాలని చూసింది. తద్వారా శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెక్ చెప్పాలని భావించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మండలి చైర్మన్ మోసేన్ రాజు దీనికి అడ్డుపడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం పొందితే.. మండలి మొత్తం కూటమి చేతుల్లోకి వెళ్లిపోతుందని భావించి.. ఆ రాజీనామాలను ఆమోదించకుండా పెండింగ్లో పెట్టారు. ఏడాదికాలంగా తొక్కి పెట్టారు.శాసనమండలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన బలం ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత 38 మంది వరకు ఎమ్మెల్సీల మద్దతు ఉండేది. తెలుగుదేశం పార్టీ ప్రాతినిధ్యం తక్కువ. ఇటువంటి పరిస్థితుల్లో చాలామంది ఎమ్మెల్సీలు వైసిపికి దూరమయ్యారు. తెలుగుదేశం పార్టీతో పాటు జనసేనకు దగ్గరయ్యారు. అటువంటివారు రాజీనామా చేసినా ఇంతవరకు ఆమోదానికి నోచుకోలేదు. కూటమితో ఒప్పందం చేసుకున్న చాలామంది ఎమ్మెల్సీలు తమ పదవులకు రాజీనామా చేశారు. అయితే ఆ రాజీనామా ఆమోదానికి నోచుకుని ఉంటే టిడిపి తో పాటు జనసేనలో చేరేవారు. కానీ వైసీపీకి చెందిన మండలి చైర్మన్ అడ్డుపడుతున్నారు. దీంతో పోతుల సునీత, కర్రీ పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి పొలిటికల్ డిఫెన్స్ లో ఉన్నారు. అటు మర్రి రాజశేఖర్ పరిస్థితి అలానే ఉంది. జయ మంగళం వెంకటరమణ మాత్రం జనసేనలో చేరారు. ఆయన టిడిపి నుంచి వైసీపీలో ఎన్నికలకు ముందు చేరారు. వైసిపి ఓడిపోవడంతో జనసేనలో చేరారు. తన రాజీనామాను ఆమోదించాలని తాజాగా ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇస్తే మాత్రం.. మిగతావారు సైతం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. చూడాలి మరి ఎలాంటి తీర్పు వస్తుందో?

# కాకినాడ కూటమిలో కలకలం

కాకినాడ, ఆగస్టు 28, కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి భర్త, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సత్యనారాయణమూర్తి తన పదవికి రాజీనామా చేయడం సంచలనంగా మారింది. మీడియా సమావేశంలో ఆయన లేవనెత్తిన పలు అంశాలు చర్చకు దారితీశాయి. టీడీపీ నాయకులకు ప్రధాన్యతనివ్వడం లేదని ఆయన ఆవేదన వెళ్లగక్కారు. అయితే కాకినాడ జిల్లాలోని కూటమిలో కుంపటి నివురు గప్పిన నిప్పులా రాజుకుంటుందని చర్చ సాగుతోంది.ఇప్పటికే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోను ద్వితీయ శ్రేణి నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జనసేన పార్టీ ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదంటూ టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆరోపించటంపై కాకినాడ జిల్లాలో కూటమి ఐక్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.కాకినాడ రూరల్ నియోజకవర్గంలో టీడీపీకు అత్యంత విశ్వసనీయమైన దంపతులుగా కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆమె భర్త పిల్లి సత్యనారాయణమూర్తికి పేరు ఉంది. ఎమ్మెల్యేగా అనంతలక్ష్మి ఉన్నప్పటికీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఆమె భర్త సత్యనారాయణమూర్తి వ్యవహరిస్తుంటారు.1999 అప్పటి సంపర నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి అనంతలక్ష్మి గెలిచారు. ఆ తరువాత నియోజకవర్గాల పునర్విభజన తరువాత కాకినాడ రూరల్ నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న ఈ దంపతులు టీడీపీకు అత్యంత విశ్వసనీయమైన నాయకులుగా గుర్తింపు పొందారు.. ఆ తరువాత 2014లో టీడీపీ తరపున కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుపై పోటీచేసి 9 వేలకుపైగా మెజార్టీ పొంది విజయం సాధించారు. 2019లో కూడా పిల్లి అనంతలక్ష్మికే ప్ర?ధాన్యత ఇచ్చి కాకినాడ రూరల్ టీడీపీ సేటు ఇచ్చి పోటీలో దింపింది. అయితే మాజీ మంత్రి కురసాల కన్నబాబు విజయం సాధించారు..ఆ తరువాత కాకినాడ రూరల్ నియోజకవర్గాల సమన్వయ కర్తలుగా కీలక బాధ్యతలు స్వీకరించిన పిల్లి దంపతులకు 2024లో మాత్రం తీవ్ర నిరాశే ఎదురయ్యింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన నేపథ్యంలో కాకినాడ రూరల్ జనసేన పార్టీక కేటాయించడంతో పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తిల అనుచరులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కాకినాడలోని వీరి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.. అధిష్టానం పిలుపుతో ఉన్నఫళంగా అమరావతి వెళ్లిన దంపతులు చివరకు బుజ్జగింపుతో వెనక్కి తగ్గి జనసేన పార్టీ అభ్యర్థి పంతం నానాజీ గెలుపునకు పనిచేశారు...కాకినాడ రూరల్ టీడీపీ కో-ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మితో కలిసి పిల్లి సత్యనారాయణమూర్తి ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి సముచిత స్థానం కల్పించడంలో పార్టీ విఫలమైందని జనసేనకు చెందిన ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పథకాలలో టీడీపీకి ఇవ్వవలసిన 50శాతం వాటాను ఇవ్వకుండా చేస్తున్నారని దానివల్ల కార్యకర్తలకు ఏ విధమైన న్యాయం చేయలేకపోతున్నాననే మనస్థాపనతో టీడీపీ ఇచ్చిన కో- ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేస్తున్నానని సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు.. గడిచిన 14 నెలలలో గెలిచిన ఎమ్మెల్యే నానాజీ కనీసం తమ వంక కూడా చూడకపోగా టీడీపీ కార్యకర్తలను, నాయకులను కానీ పట్టించుకునే పరిస్థితి కూడా లేదని పిల్లి ఆవేదన వ్యక్తం చేశారు. తమ కార్యకర్తలకు ఏ విధమైన న్యాయం చేయలేకపోతున్నానే బాధతో రూరల్ కో-ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.నియోజకవర్గ అబ్జర్వర్‌గా ఉన్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఏకపక్ష నిర్ణయాలతో గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కోకో ఆర్డినేటర్గా ఉన్న కటకంశెట్టి సత్య ప్రభాకర్ (బాబీ) రూరల్ నియోజకవర్గం పార్టీలో విభేదాలు తీసుకొచ్చారని అన్నారు. తనను రాజకీయంగా ఎదగడానికి లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. తప్పుడు రాజకీయాలను నిలువరించవలసిన స్థానంలో ఉన్న అబ్జర్వర్ కుడిపూడి గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్నారని పిల్లి ఆరోపించారు. తాను 40 ఏళ్ల క్రితం పార్టీలో చేరానని నేటికీ అదే పార్టీలో ఉన్నానని చెప్పారు. తాను చనిపోయిన తర్వాత కూడా టీడీపీ జెండా తనపై కప్పి శ్మశానానికి తీసుకెళ్లడమే తన చివరి కోరికని ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లి సత్యనారాయణమూర్తి తన పదవికి రాజీనామా వ్యవహారంపై టిడిపి అధిష్టానం దృష్టి సారించింది.. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పిల్లి సత్యనారాయణ, అనంత లక్ష్మి దంపతులను కలిసి చర్చించారు.. త్వరలోనే అన్ని సర్దుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు..

# ప్రతి ఐదేళ్లలో 60 శాతం పెరుగుదల

బంగారం ధర మళ్లీ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరువ అవుతోంది. బంగారం ధర ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. గత ఇరవై ఏళ్లలో పసిడి ధరల వేగం చూస్తే మతిపోతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 2000వ సంవత్సరంలో రూ.4,400 ఉండగా.. 2005 నాటికి రూ.7 వేలకు పెరిగింది. 2010లో తులం బంగారం ధర రూ.18,500గా ఉండగా.. 2015 నాటికి రూ.26,300కి చేరుకుంది. 2020లో 10 గ్రాముల బంగారం ధర రూ.48,600గా ఉంది.ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,03,000గా ఉంది. పసిడి ప్రతి ఐదేళ్లకు సగటున 50 నుంచి 60 శాతం దాకా పెరుగుతూ చ్చింది. ఏడాదికి కనీసం 15 శాతం రేటు పెరుగుతోంది. నిజానికి కరోనా సమయంలో బంగారం ధర పెరిగినా.. తులం బంగారం రూ.లక్షకు చేరడానికి మరో పదేళ్లు పడుతుందని అప్పట్లో అంచనా వేశారు. కానీ ఆ అంచనాలన్నీ తప్పని నిరూపిస్తూ.. ఐదేళ్లు తిరక్కుండానే.. పుత్తడి రూ.లక్ష దాటి సామాన్యుల్ని బెదరగొడుతోంది.భౌగోళిక రాజకీయ అనిశ్చితుల తరుణంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ ధరలు చూశాక అసలు బంగారం ఎలా కొనాలా అని సామాన్యులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. ఓవైపు పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. మరోవైపు పండగల సీజన్ ప్రారంభం కాబోతోంది. ఇలాంటి టైమ్ లో పసిడి అందుబాటులో లేకుండా పోవడం సామాన్యుడికి మింగుడుపడటం లేదు. తులం బంగారం రూ.లక్ష పెట్టి కొని కూతుళ్ల పెళ్లిళ్లు చేయడం మధ్యతరగతి తండ్రులకు తలకు మించిన భారంగా మారింది. కానీ భారతీయ సమాజంలో పెళ్లంటే.. బంగారం తప్పనిసరి. అలాంటి పసిడి కొనే పరిస్థితి లేకపోవడంతో.. చాలా కుటుంబాల ప్లాన్లు తల్లకిందులౌతున్నాయి. కొంతమంది ఇతరత్రా ఖర్చు?లు తగ్గించుకుని, మరికొంతమంది బడ్జెట్ ఇంకా పెంచుకుని ఏవో తంటాలు పుడతున్నారు. కానీ మెజార్టీ మిడిల్ క్లాస్ తండ్రులు మాత్రం దేవుడిపైనే భారం వేసి నెట్టుకొస్తున్నారనే చెప్పాలి జూలై నెలలో కాస్త తగ్గుముఖం పట్టినట్టు అనిపించిన బంగారం ధరలు ఈ నెల మొదటి వారంలో ఊహించని విధంగా భారీ పెరుగుదలను నమోదు చేశాయి.భారతీయులకు బంగారు ఆభరణాలు అంటే ఎంత ఆసక్తి ఉంటుందో తెలిసిందే. ముఖ్యంగా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, పండగల సమయాల్లో కచ్చితంగా గోల్డ్ జువెల్లరీ కొనుగోలు చేస్తుంటారు. ఆడపిల్ల పెళ్లి సమయంలో వారికి బంగారం పెడతారు. ఇది మన దగ్గర ఎప్పటినుంచో సంప్రదాయంగా ఉంది. ఇంకా ఏదైనా చిన్న పిల్లల ఫంక్షన్ల సమయాల్లో బంగారాన్నే గిఫ్ట్‌గా ఇస్తుంటారు. అంతటి డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్ దృష్ట్యానే రేట్లు ఉంటాయి. ఇక ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా బంగారానికి ఊహించని స్థాయిలో డిమాండ్ పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రేట్లు కూడా రికార్డు స్థాయి గరిష్టాలకు ఎగబాకుతున్నాయి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో డాలర్ ప్రభావితం అవడం, యూఎస్ విధిస్తున్న సుంకాలు వెరసి బంగారం ధరలు పెరుగుతున్నాయి. సాధారణంగా డాలర్ బలం పుంజుకుంటే బంగారం ధరలు తగ్గుముఖం పడతాయి. ప్రపంచ విపణిలో బంగారం ధరలకు డాలర్ విలువకు మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది.

ప్రస్తుతం గ్లోబల్ ఉద్రిక్తతల మధ్య మార్పులకు లోనవుతున్న బంగారం ధరలు ప్రస్తుతం పెరుగుతున్నాయి.ట్రంప్ టారిఫ్ లు పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేశాయి. మార్కెట్లలో అనిశ్చితి రాజ్యమేలుతోంది. ఇలాంటి సంక్షోభ, సంక్లిష్ట సమయాల్లో బంగారం సురక్షిత పెట్టుబడి సాధనంగా ఉంటుంది. తద్వారా పెట్టుబడిదారులు ఇటువైపు మొగ్గుచూపుతారు. దీంతో రేట్లు కూడా పెరుగుతుంటాయి. భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ పెద్ద మొత్తంలో దిగుమతి సుంకాల్ని విధించారు. గోల్డ్ రేటు భారీగా పెరగ్గా.. మళ్లీ రష్యా చమురు వివాదం పరిష్కారం అయ్యే వరకు భారత్‌తో చర్చలేం ఉండవని ట్రంప్ చేసిన ఒక్క ప్రకటనతో బంగారం రేట్లు మళ్లీ భారీగా పుంజుకున్నాయి. ఆల్ టైమ్ హైని నమోదు చేశాయి.అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు, డాలర్ విలువ క్షీణించడం వంటివి కూడా పసిడి వైపు పెట్టుబడులు మళ్లడానికి కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. చిప్ దిగుమతులపైనా 100 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ బెదిరింపులకు దిగుతుండడంతో మరోసారి వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్నాయి. ఇవి బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయి. ఇప్పటివరకు పన్ను మినహాయింపు కింద ఉన్న స్విట్జర్లాండ్ బంగారంపై కొత్త టారిఫ్ వల్ల ప్రపంచ పసిడి మార్కెట్లో సరఫరా దెబ్బతినే అవకాశం ఉంది. ప్రధానంగా అమెరికా జాబ్ మార్కెట్ బలహీనత, ఫెడ్ వడ్డీ రేట్ల కోత ప్రభావం బంగారంపై డైరక్ట్ గా పడుతోంది.

మన దేశంలో కేవలం నగల కోసమే కాకుండా బంగారాన్ని పెట్టుబడిగా చూసే ధోరణి కూడా పెరిగింది. మన దగ్గర పెట్టుబడి మార్గాల విషయానికొస్తే బంగారంతో పాటు భూమి, ఫిక్స్‌డ్ డిపాజిట్లున్నాయి. ఎక్కువ మంది భారతీయుల దృష్టిలో ఉన్న పెట్టుబడి ఆప్షన్లు ఇవే. కాకపోతే బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే భూమిపై పెట్టిన పెట్టుబడికే ఎక్కువ ప్రతిఫలం వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. పాతికేళ్ల క్రితం 10 గ్రాముల బంగారం ధర రూ.4 వేలు. అదే ఇప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.1,04.000. అంటే 2000వ సంవత్సరంలో 25 తులాలు బంగారం కొనుంటే.. ఇప్పుడు పాతిక లక్షల రూపాయలు అవుతాయి. అదే 2000వ సంవత్సరంలో రూ. లక్ష పెట్టి భూమి కొంటే.. అదిప్పుడు రూ. కోటి అవుతుంది. అదే పాతికేళ్ల క్రితం రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే.. ఇప్పుడు రూ.16 లక్షలు అవుతుంది. ఇక్కడ ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే బంగారంపై ఎక్కువ ప్రతిఫలం వస్తోంది. కానీ దాని కంటే భూమి మీద పెట్టే పెట్టుబడికి మరింత ప్రతిఫలం వస్తుందని రుజువైపోతోంది.

ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న పసిడి ధరను దృష్టిలో పెట్టుకుని చూస్తే.. బంగారం కంటే భూమిపై పెట్టుబడి పెట్టడమే మేలనే అభిప్రాయాలు వస్తున్నాయి.

# తిరుపతికి మరో వందే భారత్ ట్రైన్

విశాఖపట్టణం, ఆగస్టు 28,దేశ వ్యాప్తంగా కేంద్రం వందేభారత్ రైళ్లను నడుపుతోంది.. ప్రధాన నగరాల మధ్య ఈ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో నడుస్తున్నాయి. అయితే కేంద్రం డిమాండ్ ఉన్న మార్గాల్లో కొత్తగా వందేభారత్ రైళ్లను ఏర్పాటు చేస్తోంది.. అలాగే రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతిపాదనల్ని కూడా పరిగణలోకి తీసుకుని ఆయా రాష్ట్రాలకు వందేభారత్ రైళ్లను కేటాయిస్తున్నారు. ఇటీవల పలు వందేభారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మరికొన్ని రూట్లలో కూడా వందేభారత్ రైళ్ల ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఏపీ నుంచి రెండు కొత్త వందేభారత్ రైళ్లు నడపాలని ప్రతిపాదిస్తున్నారు.ఏపీలోని విశాఖపట్నం- బెంగళూరుకు మధ్య కొత్త రైళ్లు, విశాఖపట్నం- తిరుపతి మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని కేంద్రాన్ని కోరామన్నా ఎంపీ శ్రీ భరత్. ఈ కొత్త వందేభారత్, కొత్త రైళ్ల ప్రతిపాదనపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. అంతేకాదు మంగళపాలెం దగ్గర ఆర్‌యూబీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తు చేశారు.. అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. విశాఖపట్నం రైల్వే జోన్‌కు సంబంధించిన కార్యకలాపాలు త్వరలో మొదలవుతాయని తెలియజేశారు. అంతేకాదు విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని.. ఎవరూ నమ్మొద్దని కోరారు. విశాఖపట్నం-తిరుపతి వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే తిరుమల వెళ్లే భక్తులకు పండగే.మరోవైపు విజయనగరం జిల్లాలో ఉన్న శృంగవరపుకోట (ఎస్ కోట) నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో కలపాలని ఏపీ ప్రభుత్వానికి లేఖ రాసి పంపినట్లు ఎంపీ శ్రీ భరత్ తెలిపారు. ఈ నిర్ణయంపై సానుకూల స్పందన వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీకి సంబంధించిన పలు అంశాలను క్లియర్ చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు అందజేశామన్నారు. 'దక్షిణ భారత నోడల్ హబ్‌గా విశాఖపట్నంలో డిజేబిలిటీ స్పోర్ట్స్ సెంటర్, మార్షల్ ఆర్ట్స్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన పంపించాము' అన్నారు.విశాఖపట్నం నుంచి ఒకటి, రెండు వందేభారత్ రైళ్లను నడపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. విశాఖపట్నం నుంచి బెంగళూరు, విశాఖపట్నం నుంచి చెన్నైకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను నడపాలని గతంలో కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం నుంచి బెంగళూరుకు, విశాఖపట్నం నుంచి తిరుపతికి వందేభారత్ రైలు నడపాలని కోరుతున్నారు. మరి ఈ ప్రతిపాదనలపై రైల్వేశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. వీటితో పాటుగా పలు రైల్వే స్టేషన్‌లలో ప్రస్తుతం ఏపీ మీదుగా నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కూడా రైల్వేమంత్రిని కోరారు. ఇప్పటికే హిందూపురం రైల్వే స్టేషన్‌లో కాచిగూడ-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైలు ఆగేందుకు రైల్వేమంత్రి అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే.

## ఇల్లందు లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లందు సింగరేణి ఏరియా కోయగూడెం ఉపరితలగనిలో వర్షం కారణంగా బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచింది. దాదాపు 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 45 వేల క్యూబిక్ మీటర్ల(ఓవర్ బర్డెన్) మట్టి వెలికితీత పనులకు పూర్తిగా ఆటంకం కలిగింది. గనిలో చేరిన సుమారు ఆరు వందల లక్షల గ్యాలన్ల వరద నీటిని సిబ్బంది 6 భారీ మోటార్ల సహాయంతో బయటకి తోడేస్తున్నారు.

## మూషికం చెవిలో చెబితే...
## అనుకున్న పని గ్యారంటీ

ముంబై, ఆగస్టు 28, కష్టాలను తొలగించే దేవుడిగా వినాయకుడికి పేరు ఉంది. అందువల్లే ఆయనను విఘ్న అధిపతి అంటారు. వినాయకుడికి కష్టాలను తొలగించడం మాత్రమే కాదు.. వరాలు ఇవ్వడం కూడా తెలుసు. అలాంటి వరాలు ఇచ్చే గణపతుల్లో.. ఈ స్వామివారు ఫేమస్..ముంబైలో సిద్ధి వినాయకుడికి సంతాన ప్రదాతగా పేరుంది.. సిద్ధి వినాయకుడి ఆలయాన్ని 1801 సంవత్సరంలో నిర్మించారు. ఈ ఆలయానికి నాడు ద్యూబాయ్ పటేల్ ఆర్థిక సహకారం అందించారు.. లక్ష్మణ్ వితు పాటిల్ అనే కాంట్రాక్టర్ నిర్మాణంలో పాలుపంచుకున్నా. పాటిల్ కు సంతానం లేకపోవడంతో.. తనలాంటి బాధ ఇతర మహిళలు పడకూడదని ఈ గణపతి ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి దర్శనానికి వచ్చే మహిళలకు సంతాన ప్రాప్తి కలిగించాలని ఆమె అప్పట్లో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆమె చేసిన పూజల వల్ల అనేక మంది సంతానం లేని మహిళలకు ఆ ప్రాప్తి కలిగింది..సంతానం లేని మహిళలు ఈ ఆలయాన్ని ఎక్కువగా దర్శించుకుంటూ ఉంటారు. ఇక్కడ కొలువై ఉన్న స్వామివారిని సవ సచ గణపతి అని పిలుస్తుంటారు. కోరిన కోరికలు తీరుస్తాడని దాని అర్థం. ఇక్కడ స్వామి వారు సిద్ధి, బుద్ధి సమేతంగా ఉంటారు. స్వామివారికి పై చేతిలో గొడ్డలి.. ఇంకొక చేతిలో తామర పువ్వు ఉంటాయి. ఇక కింది చేతుల్లో అయితే జపమాల.. లడ్డు కనిపిస్తుంటాయి. ఈ ఆలయానికి ప్రతి ఏడాది 125 కోట్ల ఆదాయం వస్తూ ఉంటుంది. బంగారం, ఇతర కార్యదైనా వస్తువులు కూడా విపరీతంగా వస్తూ ఉంటాయి. చిత్ర పరిశ్రమ చెందిన వారంతా స్వామి వారిని దర్శించుకుంటారు.. ఇక్కడ స్వామి వారు విచిత్రంగా ఉంటారు. సాధారణంగా గణపతి విగ్రహాలకు తొండం ఎడమవైపునకు తిరిగి ఉంటుంది. ఇక్కడ మాత్రం కుడివైపు ఉంటుంది. స్వామివారి విగ్రహం ఎదుట వెండితో తయారుచేసిన మూషికం ఉంటుంది. భక్తులు తమ కోరికలను ఆ మూషికం చెవిలో చెబితే తీరుతాయని నమ్మకం. గణపతి నవరాత్రి ఉత్సవాల సమయంలో ఈ ఆలయం భక్తులతో కిటికిటలాడుతూ ఉంటుంది.

# విజయ్ ను చుట్టుముడుతున్న కేసులు



చెన్నై, ఆగస్టు 28, (న్యూస్ పల్స్) తమిళనాడు భవిష్యత్తును సమూలంగా మార్చడానికి రాజకీయాల్లోకి వచ్చారు టీవికే అధినేత విజయ్. తమిళ చిత్ర పరిశ్రమలో సుప్రసిద్ధ నటుడిగా విజయ్ కి పేరుంది. రజనీకాంత్ తర్వాత ఆ స్థాయిలో అతనికి అభిమానుల ప్రోత్సాహం ఉంది. అందువల్లే అతడు టీవీకే పేరుతో ఒక పార్టీని ఏర్పాటు చేశాడు. గతంలో ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించిన అతడు.. ఇటీవల మానాడు పేరుతో మధురైలో భారీ సభను నిర్వహించాడు. ఈ సభకు భారీ ఎత్తున జనం వచ్చారు. సోషల్ మీడియా, మీడియాలో టీవీకే బహిరంగ సభ సరికొత్త రికార్డులు నెలకొల్పింది.. రికార్డు స్థాయిలో విజయ్ ప్రసంగాన్ని నెటిజన్లు వీక్షించారు. మధురై లో నిర్వహించిన మానాడు సభలో విజయ్ చేసిన వ్యాఖ్యలు తమిళనాడులో అనేక వివాదాలకు కారణమయ్యాయి. అధికార డిఎంకె, అన్నా డీఎంకే, బిజెపి నాయకులు విజయ్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కూడా విజయ్ ని విమర్శిస్తున్నారు. ఏమాత్రం అనుభవం లేకుండా అడ్డగోలుగా అలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగానే విజయ్ పై తమిళనాడులో కేసు నమోదు అయింది. మధురై లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న క్రమంలో.. విజయ్ అభిమానులకు అభివాదం చేస్తుండగా.. కొంతమంది విజయ్ వద్దకు వచ్చారు. బౌన్సర్లు వారిపై దాడి చేసి కిందికి తోసి వేశారు. అందులో ఒక అభిమాని కిందపడ్డాడు. అతడికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో శరత్ కుమార్ అనే అభిమాని పోలీస్ స్టేషన్లో టీవీకే అధినేతకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు అయింది. బౌన్సర్లపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇటీవల కేంద్రం ఒక చట్టం తీసుకొచ్చింది. కేసులు ఉన్నవాళు పదవుల్లో కొనసాగే అవకాశం లేదని ఆ చట్టం ఉద్దేశం. దీనిని కేంద్ర హోం శాఖ మంత్రి ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టారు. దీనిపై విపక్ష నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇలాంటి చట్టం వచ్చిన నేపథ్యంలో విజయ్ పై కేసు నమోదు కావడం సంచలనం కలిగిస్తోంది. ఒకవేళ ఇటువంటి కేసులు ఇలా నమోదు అవుతూ ఉంటే విజయ్ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడుతుందని విశ్లేషకులు అంటున్నారు. మరికొందరేమో ఇలాంటి కేసులు ఆయన రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయలేవని.. ఇవన్నీ సర్వ సాధారణమని పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ విజయ్ మీద కేసు నమోదు కావడం పట్ల ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదంతా కుట్ర అని చెబుతున్నారు. వీటన్నింటిని విజయ్ చేదించుకొని బయటపడతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్ కు ఏమైంది...



హైదరాబాద్, ఆగస్టు 28, తెలంగాణ రాజకీయాలలో గులాబీ దళపతి కేసీఆర్ ది ప్రత్యేకమైన ముద్ర. ముఖ్యంగా గడచిన పది సంవత్సరాలలో ఆయన తెలంగాణ రాజకీయాలను శాసించారు. తెలంగాణ రాజకీయాలను శ్వాసించారు. దక్షిణాది నుంచి ఏకంగా దేశ రాజకీయాలలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని అనుకున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే కెసిఆర్ ఈ సమయానికి దేశ రాజకీయాలలో కీలకపాత్ర పోషించేవారు. కానీ ఆయన అనుకున్నవి నెరవేరలేదు కాబట్టి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షానికి మాత్రం పరిమితమయ్యారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కూడా ఆయన వేలు పెట్టారు. కానీ అక్కడ కూడా ఆయన ఊహించని ఫలితమే వచ్చింది. తెలంగాణలో 2023 లో జరిగిన ఎన్నికల్లో కెసిఆర్ ఊహించని ఫలితం వచ్చింది. దానికి తోడు ఆయన కామారెడ్డిలో పోటీ చేసి ఓడిపోయారు. అంతేకాదు తెలంగాణలో ప్రభుత్వం కొలువు తీరే క్రమంలోనే ఆయన తన ఇంట్లో కాలు జారిపడ్డారు. ఆ సమయంలో ఆయన కాలు ఫ్రాక్చర్ అయింది. కొంతకాలం ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం శస్త్ర చికిత్స చేయించుకుని శాసనసభలోకి అడుగుపెట్టారు. శాసనసభకు ఆయన రెండు మూడు పర్యాయాలకు మించి ఎక్కువ హాజరు కాలేదు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ కర్ర పట్టుకొని కేసీఆర్ ప్రసంగించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇక మధ్య మధ్యలో కెసిఆర్ తరచూ అనారోగ్యానికి గురి కావడం.. పరీక్షలు చేయించుకోవడం పరిపాటిగా మారిపోయింది. ఇటీవల కూడా గులాబీ దళపతి అనారోగ్యానికి గురయ్యారని వార్తలు వచ్చాయి. ఆయన రక్తంలో సోడియం నిలువలు పెరిగిపోయాయని.. వైద్యులు బయటికి వెల్లడించారు. వైద్యుల బృందం నేరుగా ఆయన ఉన్న వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పరీక్షలు నిర్వహించారని.. కెసిఆర్ ఆరోగ్యానికి పెద్దగా ఇబ్బంది లేదని గులాబీ మీడియా వెల్లడించింది. దీనికి తోడు కొంతకాలంగా కేసీఆర్ కుటుంబంలో రాజకీయంగా విభేదాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు.. గులాబీ పార్టీ శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత మధ్య రాజకీయంగా విభేదాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. లేఖల లీకులు, కార్మిక సంఘ గౌరవ అధ్యక్ష పదవి నుంచి జాగృతి అధినేత్రిని తొలగించడం వంటి పరిణామాలు ఇటీవల కాలంలో చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సోదరి సోదరుల మధ్య పూడ్చలేని ఆగాధం ఏర్పడిందని తెలుస్తోంది. దీనిని గులాబీ మీడియా ఖండించినప్పటికీ.. అంతర్గతంగా జరుగుతోంది అదేనని సమాచారం. ఎంత అనారోగ్యానికి గురైనప్పటికీ కెసిఆర్ ముఖంలో కొద్దిగా తేడా ఉండేది కాదు. పైగా ఆయన నిబ్బరంగా ఉండేవారు. కానీ తన సతీమణితో కలిసి గణపతి చవితి వేడుకల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేసిన ఫోటోలో కేసిఆర్ అంతగా ఆరోగ్యంగా ఉన్నట్టు కనిపించడం లేదు. ఆయన ముఖం కూడా కాస్త నల్లగా మారిపోయింది. అంతేకాదు ముఖంలో కళ కూడా కనిపించడం లేదు. రాజకీయంగా కుటుంబ సభ్యుల మధ్య చోటు చేసుకుంటున్న వివాదాలు.. అనారోగ్య సమస్యలు గులాబీ దళపతిని ఇలా మార్చేస్తున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే గులాబీ మీడియా మాత్రం వాటిని ఖండిస్తోంది. గులాబీ దళపతి బలంగా ఉన్నారని.. దృఢంగా ఉన్నారని.. లేనిపోని వ్యాఖ్యలు చేసి అనవసరమైన వివాదాలకు కారణం కావద్దని సూచిస్తుంది.

# ఔటర్ రింగ్‌రోడ్డుపై భారీ సోలార్ ప్రాజెక్టు

హైదరాబాద్, ఆగస్టు 28, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. 158 కిలోమీటర్ల మేర సోలార్ పలకలు ఏర్పాటు చేసి 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థలం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం హెచ్‌జీసీఎల్ కన్సల్టెంట్‌లను నియమించనుంది. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) ద్వారా కరెంట్ ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రణాళికలు రచిస్తోంది. ఓఆర్ఆర్‌ను సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు హెచ్ఎండీఏ రెడీ అయింది. ఈ మేరకు కార్యాచరణ రూపొందించడానికి హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ (హెచ్‌జీసీఎల్) కన్సల్టెంట్‌లను నియమించనుంది. ఈ నెల 28 టెండర్లకు చివరి తేదీగా ప్రకటించారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే.. ఇది దేశంలోనే ఒక వినూత్నమైన, పర్యావరణ అనుకూల ప్రాజెక్టుగా నిలుస్తుంది. ప్రస్తుతం ఔటర్ రింగ్‌రోడ్డుపై నానక్‌రాంగూడ నుంచి టీఎస్‌పీఏ, నార్సింగి నుంచి కొల్లూరు వరకు 19.2 కిలోమీటర్ల మేర సోలార్ రూఫ్‌టాప్‌తో సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేశారు. దీనికి రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 16 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకోగా.. ప్రస్తుతం 13 మెగావాట్ల వరకు ఉత్పత్తి అవుతోంది. ఈ విద్యుత్తును ఓఆర్ఆర్‌పై ఉన్న ఎల్ఈడీ లైట్లు, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. తాజా ప్రణాళికల ప్రకారం.. ఓఆర్ఆర్ మొత్తం చుట్టూ సోలార్ పలకలను ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం రింగ్‌రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్ మీడియన్లు, రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్ల వెంట సోలార్ పలకలను ఏర్పాటు చేయనున్నారు. 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి సుమారు రూ.500 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు వలన కేవలం ఆర్థిక ప్రయోజనాలు మాత్రమే కాకుండా.. పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ద్వారా కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి. అలాగే, రోడ్ల మధ్యలో, సర్వీస్ రోడ్ల వెంట సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేయడం వల్ల స్థలం కూడా ఆదా అవుతుంది. హెచ్‌జీసీఎల్ ఈ ప్రాజెక్టును వేగవంతం చేసి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని చూస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ (వివరాల ప్రాజెక్టు నివేదిక)ను తయారు చేయడానికి కన్సల్టెంట్‌లను నియమిస్తున్నారు.

# ఇప్పుడు చైనాపై పడుతున్న ట్రంప్



న్యూఢిల్లీ, ఆగస్టు 28 అమెరికాను అగ్రస్థానంలో నిలిపేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తున్నారు. ఇప్పటికే చాలా దేశాలపై సుంకాల మోతమోగించారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ఇక ఇప్పుడు చైనాపై పడ్డడు ట్రంప్. చైనా ప్రపంచ రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఉత్పత్తిలో సుమారు 90% వాటాను నియంత్రిస్తుంది. ఈ మ్యాగ్నెట్స్ ఆటోమోటివ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి కీలక పరిశ్రమలకు అత్యవసరం. అమెరికా వంటి దేశాలు ఈ సరఫరాపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి, ఇది చైనాకు వాణిజ్య చర్చల్లో బలమైన పైచేయిని ఇస్తుంది. చైనా రేర్ ఎర్త్ ఎగుమతులపై నియంత్రణలను కఠినం చేసింది, దీనిని అమెరికా టారిఫ్‌లకు ప్రతీకారంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ 200% టారిఫ్ విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికను చైనాపై ఒత్తిడి తెచ్చే వ్యూహంగా చూడవచ్చు. 'మాకు మ్యాగ్నెట్స్ ఇవ్వకపోతే 200% టారిఫ్ విధిస్తాం' అని ఆయన పేర్కొన్నారు, అయితే 'ఈ సమస్య రాదని భావిస్తున్నాం' అని సమస్యను తగ్గించే ప్రయత్నం కూడా చేశారు. గట్టి హెచ్చరికలతో ఒత్తిడి చేయడం, అదే సమయంలో చర్చలకు తలుపులు తెరిచి ఉంచడం ట్రంప్‌కు అలవాటైంది. బీజింగ్‌లోని ఓ థింక్‌ట్యాంక్ అధ్యక్షుడు హెన్రీ వాంగ్ ఈ హెచ్చరికలను 'బ్లఫింగ్'గా అభివర్ణించారు, ట్రంప్ చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు పెద్దగా మాట్లాడుతున్నారని సూచించారు. 2025 ఆరంభంలో అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. రెండు దేశాలు ఒకదానిపై ఒకటి మూడంకెల టారిఫ్‌లను విధించాయి, జూన్5లో లండన్‌లో జరిగిన చర్చల్లో టారిఫ్‌లను తగ్గించేందుకు ఒప్పందం కుదిరింది, అమెరికా టారిఫ్‌లను 55%కి, చైనా 10%కి తగ్గించింది. ఈ ఒప్పందం నవంబర్ 10 వరకు కొనసాగనుంది, అయితే రేర్ ఎర్త్ సరఫరా నియంత్రణలపై వివాదం ఇంకా కొనసాగుతోంది. చైనా ఇప్పటివరకు ట్రంప్ హెచ్చరికలపై స్పష్టమైన స్పందన ఇవ్వలేదు. జూన్ 2025లో జరిగిన ఒప్పందంలో భాగంగా, చైనా ఆరు నెలలపాటు రేర్ ఎర్త్ ఎగుమతులపై నియంత్రణలను సడలించింది, అయితే సైనిక అవసరాలకు కావాల్సిన కొన్ని ప్రత్యేక రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్‌పై ఎగుమతి ఆంక్షలను కొనసాగిస్తోంది. ఈ విషయంలో చైనా తన ఆధిపత్యాన్ని ఆయుధంగా ఉపయోగిస్తోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. చైనా వ్యూహం దీర్ఘకాలంలో అమెరికా, దాని మిత్ర దేశాలను ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. దీంతో చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు అమెరికా ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టింది. ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా వంటి దేశాలతో సహకారం ద్వారా రేర్ ఎర్త్ సరఫరాను బలోపేతం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాలోని ఎంపీ మెటీరియల్స్ వంటి కంపెనీలు స్థానిక ఉత్పత్తిని పెంచేందుకు పెట్టుబడులు పెడుతున్నాయి, మొత్తంగా మొన్నటి వరకు భారత్‌పై భారీగా సుంకాలు విదించిన ట్రంప్.. ఇప్పుడు చైనాను బెదిరిస్తున్నారు. ఇదే సమయంలో చైనాకు భయపడుతున్నారు. రష్యా ఆయిల్ విషయంలో భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. చైనా దిగుమతి చేసుకుంటున్నా దాని జోలికి మాత్రం వెళ్లడం లేదు. తాజాగా 200% టారిఫ్ హెచ్చరిక చేసి కూడా ఆ పరిస్థితి రాదంటూ వ్యాఖ్యానించడం కూడా చైనాతో కయ్యానికి ట్రంప్ భయపడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# కరీంనగర్ లో విస్తారంగా వర్షాలు

కరీంనగర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురుస్తోంది. బుధవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్థంభించింది. జలాశయాలకు భారీగా వరద నీరు చేరింది. మానేరు జలాశయాలకు వరదలు పోటెత్తాయి. మానేర్ ఉప్పొంగడంతో మిడ్ మానేర్ రిజర్వాయర్ కు భారీగా వరద చేరింది. 17 గేట్లు ఎత్తి 23280 క్యూసెక్కుల నీరు లోయర్ మానేర్ డ్యామ్ ఎల్ఎండికి విడుదల చేసారు. మిడ్ మానేర్ కు ఇన్ ఫ్లో 62830 క్యూసెక్కులు

ఔట్ ఫ్లో 32990 క్యూసెక్కులు. మిడ్ మానేర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలు. ప్రస్తుతం నీటి నిలువ 20.26 టిఎంసీలు. ఎల్ఎండికి వరద పోటు పెరిగింది. ఇన్ ఫ్లో 51097 క్యూసెక్కులు. ఔట్ ఫ్లో 260 క్యూసెక్కులు. ఎల్ఎండి పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 24 టీఎంసీలు. ప్రస్తుతం నీటి నిలువ 13.65 టీఎంసీలు.

మరోవైపు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. ఇప్పటికే 40 గేట్ల 372400 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేసారు. ఆరు నుంచి ఏడు లక్షల క్యూసెక్కుల నీటిని వదిలే అవకాశం వుంది. అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. గోదావరితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శంకరపట్నం మండలంలో ఆర్కండ్ల వాగు ఉధృతం గా ప్రవహిస్తోంది. దాంతో పోలీసులు రహదారిని మూసివేసారు. శంకరపట్నం - వీణవంక మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మపురి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. గోదావరి నీట శ్రాద్ధ మండపం మునిగిపోయింది.

తీరంలోని సంతోషి మాతా ఆలయంలోకి గోదావరి వరద చేరింది. తీరంలోని మరో ఆలయం గోదావరి మాతా ఆలయం దాటి గోదావరి వరద ప్రవాహం సాగుతోంది. గోదావరి తీరప్రాంత చిరు వ్యాపారులను అధికారులు తరలించారు. ప్రజలు గోదావరి లోతట్టు ప్రాంతాలకు వెళ్ళకుండా అప్రమత్తం చేస్తున్నారు.

# రేవంత్ ను ఆడేసుకుంటున్న బీఆర్ఎస్

హైదరాబాద్, ఆగస్టు 28 హార్ రాష్ట్రంలో త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవడం ఇండియా కూటమికి అత్యంత ఆవశ్యకంగా మారింది.

ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో ఆ పార్టీ విజయం సాధిస్తామనే ధీమా లో ఉండేది. కానీ ఆ పార్టీ ఊహించిన ఫలితం రాకుండా పోయింది. దీంతో అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బిజెపిని లక్ష్యంగా చేసుకొని విమర్శలను మొదలు పెట్టింది. ఓటు చోరీ అనే అస్త్రాన్ని ప్రయోగించింది. రాహుల్ గాంధీ అయితే ఏకంగా బీహార్ లో ప్రధానమంత్రిని లక్ష్యంగా చేసుకొని వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముందు వరుసలో ఉంటున్నారు. రాహుల్ గాంధీ అయితే ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశించి ఓట్ల చోరీకి పాల్పడ్డ వ్యక్తి అంటూ విమర్శిస్తున్నారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ పిలుపుమేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ వెళ్లారు. రాహుల్ గాంధీ చేపడుతున్న ఓటు అధికారి ర్యాలీలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో తాము చేపట్టిన కుల గణన గురించి.. మహిళలకు ఉచితంగా కల్పిస్తున్న ఫ్రీ బస్సు గురించి.. అన్నదాతలకు చేసిన రుణాల మాఫీ గురించి రేవంత్ వివరించారు.. బీహార్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని రేవంత్ వివరించారు. రేవంత్ కు హిందీ మీద పట్టు ఎక్కువ కాబట్టి బీహార్ ప్రజలకు అర్థమయ్యే విధంగా మాట్లాడారు.. రాహుల్, ప్రియాంక తో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.. ఇది సహజంగానే తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఉత్సాహాన్ని కలిగించింది. కొంతకాలంగా రేవంత్ ను రాహుల్ దూరం పెడుతున్నారనే విమర్శలకు సరైన సమాధానం లభించినట్లయిందని కాంగ్రెస్ శ్రేణులు భావించాయి. వారి ఆనందాన్ని దూరం చేశారు జన్ సూరజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్. ప్రశాంత్ కిషోర్ బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆయన గతంలో ఎన్నికల వ్యూహకర్తగా ఉండేవాడు. ఆ తర్వాత రాజకీయ నాయకుడిగా మారిపోయారు. ఒక పార్టీని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుత బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రిగా రేవంత్ బీహార్ ఎన్నికల ప్రచారం కాంగ్రెస్ తరపున చేస్తున్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ స్పందించారు.." అసలు రేవంత్ రెడ్డి ఎవరు? ఆయనకు బీహార్ రాష్ట్రంలో ఏం పని? ఎన్నికల జరుగుతున్న సమయంలో బీహార్ ప్రజలను అవమానించేలా మాట్లాడారు.. ఇప్పుడు ఆయన బీహార్ రాష్ట్రానికి వచ్చి ఓట్లు అడుగుతున్నారు. ఒకవేళ రేవంత్ గనుక గ్రామాల్లోకి వచ్చి ఉంటే కర్రలు తీసుకొని తరిమే వాళ్ళు. బీహార్ రాష్ట్రాన్ని అవమానించడం కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కూడా అలవాటే. ఇది రాహుల్ గాంధీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని" ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించారు.

అయితే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్.. భారత రాష్ట్ర సమితి నాయకులను ఉద్దేశించి విమర్శలు చేస్తున్న క్రమంలో బీహార్ ప్రస్తావన వచ్చింది. కెసిఆర్ పూర్వీకులు బీహార్ నుంచి వచ్చిన వారిని.. బీహార్ వారి మనస్తత్వం దోపిడీ చేసే వ్యక్తుల మాదిరిగా ఉంటుందని రేవంత్ వ్యాఖ్యానించారు.

ఆ వ్యాఖ్యలను ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ ఉటంకించారు.. ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలను భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా విభాగం విపరీతంగా సర్కులేట్ చేస్తోంది..

## నిర్మల్ లో భారీ వర్షం..
## పలు ప్రాంతాలు జలమయం

నిర్మల్ జిల్లాలో రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జిల్లా కేంద్రంలోని విశ్వనాథ పేట కాలనీలో తెగిపోయిన రోడ్లు, రాకపోకలకు అంతరాయం కలిగింది. సోఫి నగర్ లో రాత్రి కురిసిన వర్షానికి ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ఇళ్లలోకి చేరిన వర్షపు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సారంగాపూర్ మండలం జామ్ గ్రామం వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. సారంగాపూర్ ? నిర్మల్ కు కారకోకలు నిలిచాయి. సోన్ మండలం మాదాపూర్ వద్దగల బ్రిడ్జిపై నుండి వర్షపు నీరు పొంగిపొర్లుతోంది. గాంధీనగర్, లెఫ్ట్ పోచంపాడ్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# వానలతో అతలాకుతలం...

హైదరాబాద్, ఆగస్టు 28, ఆకాశానికి చిల్లుపడ్డట్టు.. వరుణ దేవుడికి పట్టరాని కోపం వచ్చినట్టు.. కుండ పోత వాన.. జోరైన జడివాన.. మిన్నూ మన్నూ ఏకం చేసే విధంగా వర్షం కురిసింది. వర్షం ధాటికి కొండ ప్రాంతాల నుంచి వరద విపరీతంగా వచ్చింది. చెట్లు కొట్టుకు వచ్చాయి. రోడ్లు నామరూపాలు లేకుండా పోయాయి. పెద్ద పెద్ద భవనాలు కుప్ప కూలిపోయాయి. వంతెనలు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి.జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ లో ప్రస్తుతం విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. కొద్దిరోజుల క్రితమే ఈ రాష్ట్రాలలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. వర్షాలు విపరీతంగా కురవడంతో ఈ రాష్ట్రాలలో విపరీతమైన నష్టం చోటుచేసుకుంది. కనివిని ఎరుగని స్థాయిలో జమ్ము కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. జమ్మూ నగరంలో గడచిన 12 గంటల్లో ఏకంగా 30 సెంటీమీటర్ల కు మించిన వర్షపాతం నమోదయింది. రోడ్లపై నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పాఠశాలలు, కళాశాలకు సెలవు ప్రకటించారు. మరోవైపు పంజాబ్ రాష్ట్రంలోనూ విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. వరదలు కూడా ముంచెత్తుతున్నాయి. వరద వల్ల రోడ్లు నామరూపాలు కోల్పోయాయి. భవనాలు చూస్తుండగానే నేలకూలిపోయాయి. పంట పొలాలు ఇసుక మేటలు వేశాయి.హిమాలయ పర్వతాలకు దగ్గరగా ఉన్న రాష్ట్రాలలో ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. మండు వేసవిలోనే ఈ ప్రాంతంలో వర్షాలు కురిశాయి. ఇప్పుడు కూడా అదే స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. కాకపోతే గడిచిన వాన కాలంలో ఈ స్థాయిలో వర్షాలు కురవలేదు. ఈసారి మాత్రం విపరీతమైన వర్షాలు కురుస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ వర్షాల వల్ల వందల కోట్లలో నష్టం వాటిల్లు ఉంటుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. మరి కొద్ది రోజులపాటు ఈ రాష్ట్రాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది. వరద నీటి వల్ల ఈ ప్రాంతంలోని నదులు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతంలో దట్టమైన మేఘాలు ఆవరించి ఉండటం వల్ల క్లౌడ్ బరస్ట్ ఏర్పడుతోందని.. గతంలో ఎన్నడు కూడా ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదని నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిలో వర్షాలు కురుస్తుంటే మనుషులు బతకడం కష్టమేనని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు.డు పట్టణాలలో 30 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయింది. ఫలితంగా ఈ పట్టణాల పరిధిలో గ్రామాలన్నీ జలమయమయ్యాయి. కామారెడ్డి పట్టణ పరిధిలోని బొగ్గుగుడిశా గ్రామం నోట మునిగింది. ఈ గ్రామంలో 9 మంది వాగులో చిక్కుకుపోవడంతో.. రెస్క్యూ బృందాలు వెంటనే స్పందించాయి. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. సుమారు గంటపాటు జరిగిన ఈ ఆపరేషన్లో దాదాపు 20 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఆ తర్వాత ఆ 9 మందిని అత్యంత సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. జల ప్రవాహం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో వాగులో చిక్కుకుపోయిన తొమ్మిది మంది ఆర్తనాదాలు చేశారు.

రికార్డు స్థాయిలో వర్షం..

మేఘ విస్ఫోటనం వల్ల కామారెడ్డి, మెదక్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదయింది. మెదక్లోని చుట్టుపక్కల గ్రామాలు మొత్తం జలమయమయ్యాయి. కామారెడ్డిలో రైల్వే ట్రాక్ కింది నుంచి వరద నీరు ప్రవహించడంతో.. ట్రాక్ గాలిలో వేలాడుతోంది. దీంతో నిజామాబాద్, కామారెడ్డి మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పలు రైళ్ల రాకపోకలను దక్షిణ మధ్య రైల్వే నిలిపివేసింది. వేరే మార్గం మీదుగా రైళ్లను నడుపుతోంది.. కామారెడ్డిలో కనివిని ఎరుగని స్థాయిలో వర్షాలు కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది.. పంటచేలన్నీ ఇసుక మేటలు వేశాయి. చేతికొచ్చిన పత్తి నాశనమైంది. పసుపు తోటలు నేలమట్టమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రోడ్లన్నీ కొట్టుకుపోయాయి.

చెరువు కట్టలకు గండ్లు

విపరీతమైన వర్షం వల్ల కామారెడ్డి, మెదక్ పట్టణాలలో చెరువులు అలుగులు పోస్తున్నాయి. పలు ప్రాంతాలలో చెరువు కట్టలకు గండ్లు పడ్డాయి. దీంతో చెరువులో నీరు మొత్తం పంట పొలాలను ముంచింది. ఇసుక మేటలు వేయడంతో పంట పొలాలు దేనికీ పనికిరాకుండా పోయాయి. అయితే ఈ స్థాయిలో ఈ పట్టణాలలో వర్షపాతం నమోదు కావడం ఇటీవల కాలంలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. కామారెడ్డి, మెదక్ లో నీట మునిగిన ప్రాంతాలలో కలెక్టర్, ఎస్పీలు పర్యటిస్తున్నారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర రెస్క్యూ బృందాలతో సమన్వయం చేసుకుంటూ నీటమునిగిన ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేర్చుతున్నారు. ఇప్పటివరకు ప్రాణ నష్టం చోటు చేసుకోకపోయినప్పటికీ.. ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ నష్టం వందల కోట్లల్లో ఉంటుందని వారు వివరిస్తున్నారు.

# ఓటరి లిస్ట్ కుస్తీలు

హైదారాబాద్, ఆగస్టు 28 కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ ఆందోళన తెలంగాణలో తేడా కొడుతోందా? ఆ పార్టీ డిఫెన్స్‌లో పడే పరిస్థితి వస్తోందా? బీజేపీ రివర్స్ అటాక్ మొదలు పెట్టిందా? అందుకు సమాధానం చెప్పుకోవడం ఇక్కడి అధికార పార్టీ నేతలకు ఇబ్బందిగా మారిందా? అంటే ఔననే సమాధానమే వస్తోందిదేశ వ్యాప్తంగా ఓట్ చోరీ ఆందోళనతో ఓ రేంజ్‌లో జనంలోకి వెళ్ళే ప్లాన్‌లో ఉంది కాంగ్రెస్ పార్టీ. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న బీహార్‌లో బైక్ ర్యాలీలు, ఇతర ఆందోళనలతో హోరెత్తిస్తున్నారు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ. మిగతా చోట్ల ఎలా ఉన్నా? తెలంగాణలో మాత్రం ఈ విషయంలో రచ్చ అయ్యేట్టు కనిపిస్తోందంటున్నారు పరిశీలకులు. ఇక్కడ హస్తం మీదికి బాణాలు ఎక్కుపెడుతోంది కమలం.లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగి ఉంటే? అంతకు ఆరు నెలల ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మీరెలా గెలిచారు? మీకు అధికారం ఎలా వచ్చింది? ఆ ఆరునెలల వ్యవధిలో స్వల్ప మార్పులే తప్ప ఓటర్స్ లిస్ట్‌లో భారీ మార్పులేవీ జరగలేదు కదా అని ప్రశ్నిస్తున్నారు కమలం నాయకులు. దొంగ ఓట్లను తొలగించి మళ్ళీ అసెంబ్లీ ఎన్నికలకి సిద్ధమా అని కూడా సవాల్ చేస్తున్నారు. దీంతో? తెలంగాణ వరకు ఒక రకంగా కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడ్డట్టే కనిపిస్తోందని అంటున్నారు. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ఇతర రాష్ట్రాల్లో ఏం మాట్లాడినా? నడుస్తుందేమోగానీ? ఇక్కడ, అధికారంలో ఉన్న రాష్ట్రంలో అలా నడవకపోవచ్చన్న అభిప్రాయాలు పెరుగుతున్నాయి. ఆచితూచి మాట్లాడకుంటే ఎదురు దెబ్బలు తగులుతాయన్న సలహాలు సైతం వినిపిస్తున్నాయి. అయితే?పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఓట్ చోరీ తుట్టెను కదిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటు చోరీ కి పాల్పడిందని? దొంగ ఓట్లతోనే 8 ఎంపీ సీట్లు గెలిచిందని ఆరోపించారాయన. పీసీసీ చీఫ్ వ్యాఖ్యలకు బీజేపీ గట్టిగానే కౌంటర్ ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సంగతి ఏంటని, రాష్ట్రంలో దొంగ ఓట్లతోనే గెలిచారా అని ప్రశ్నిస్తోంది.ఇక, కాంగ్రెస్ కూడా 8 ఎంపీ సీట్లు గెలిచింది కదా.. మరి ఆ సంగతేంటని అడుగుతున్నారు కాషాయ నేతలు. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీనే కదా.. అధికార యంత్రాంగం మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చేతిలోనే ఉందికదా?. మరి బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడితే మీరెందుకు మౌనంగా ఉన్నారని గట్టిగా అడుగుతున్నారు తెలంగాణ బీజేపీ నాయకులు. 64 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ కి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 6 నెలల లోపే పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పుడు ఉన్న ఓటర్ జాబితా తోనే లోక్‌సభ ఎన్నికలు జరిగాయని చెబుతున్నారు బీజేపీ లీడర్స్. ఒక వేళ ఓటర్ జాబితా ఫేక్ అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న 64 మంది ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారన్నది బీజేపీ క్వశ్చన్. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి పోలింగ్ ఏజెంట్స్ లేరా, వాళ్ళంతా బూత్‌ల దగ్గర ఏం చేశారంటూ నిలదీస్తోంది బీజేపీ. నిజంగానే మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించినట్టు దొంగ ఓట్లు ఉంటే? వాటిని తొలగించి మళ్ళీ అసెంబ్లీ ఎన్నికలకి వెళ్లేందుకు కాంగ్రెస్ సిద్ధమా అని సవాల్ చేస్తున్నారు బీజేపీ నేతలు. కాంగ్రెస్ చీఫ్ తెలంగాణ ప్రజలను అవమానించేలా మాట్లాడారని అంటోంది బీజేపీ. దీంతో ఇప్పుడు రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య ఓటర్ లిస్ట్ కుస్తీలు మొదలైనట్టయింది.

# అసెంబ్లీలో కాళేశ్వరం ఫైట్...

హైదరాబాద్, ఆగస్టు 28 తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభ తేదీ ఖరారైంది. ఈ నెల 30 నుంచి.. అసెంబ్లీ తాజా సెషన్ మొదలవబోతోంది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు.. కాళేశ్వరం కమిషన్ నివేదిక మీద కూడా ఈసారి చర్చించబోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుపై వేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఈపాటికే రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. దాని మీద కేబినెట్‌లో డిస్కషన్ జరిగింది. అసెంబ్లీలో చర్చకు పెట్టాలని ఆ సందర్భంగానే డిసైడ్ అయ్యారు ప్రభుత్వ పెద్దలు. రాష్ట్రంలో ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి మొదలైంది.

ఈ పరిస్థితు?లలో? అసెంబ్లీ సమావేశాలు పెడతారా..? లేదా..? అనే మీమాంస ఉండేది. కానీ? 29న కేబినెట్ మీటింగ్, 30నుంచి అసెంబ్లీని సమావేశ పరచాలని డిసైడ్ అయ్యింది రేవంత్ సర్కార్. కాళేశ్వరం కమిషన్..మొత్తం 665 పేజీల నివేదిక ఇచ్చింది. దాన్నే సభలో ప్రవేశ పెట్టాలనుకుంటోందట ప్రభుత్వం.కాళేశ్వరం కమిషన్ నివేదిక పూర్తి డాక్యుమెంట్‌ను సభ్యులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. సభలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు ప్రతులు ఇచ్చి? అందరి అభిప్రాయాలు సేకరించాలనుకుంటున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో అధికార పార్టీతో పాటు మిత్రపక్షం సీపీఐ, విపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఉన్నాయి. ఈ క్రమంలోనే? కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదిక పై తదుపరి చర్యల కోసం అన్ని పార్టీల అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించుకున్నారట సీఎం రేవంత్‌రెడ్డి. అన్ని పార్టీల అభిప్రాయాలకు అనుగుణంగా విచారణకు ఆదేశించాలని భావిస్తోందట ప్రభుత్వం. కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం పార్టీలు కమిషన్ నివేదిక ప్రకారం పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీ మాత్రం.. సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేస్తోంది. అటు బీఆర్ఎస్ మాత్రం?ఇప్పటికే కమిషన్ నివేదికపై హైకోర్టు మెట్లెక్కింది.రిపోర్ట్ పేరుతో ఈ ప్రభుత్వం కేసీఆర్ ఇమేజ్ ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారు గులాబీ నాయకులు. అసలా నివేదికను రద్దు చేయాలంటూ కోర్టుకు వెళ్ళారు. కానీ? కోర్ట్‌లో ఃఖీూ కి చుక్కెదురైంది. నివేదికపై సభలో చర్చిస్తామని ప్రభుత్వం కోర్ట్‌కు చెప్పినట్టుగానే.. 30 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరుగుతుందని అంటున్నారు. అటు బీఆర్ఎస్ కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే నివేదికపై సీరియస్ గానే చర్చించాలనుకుంటున్నట్టు సమాచారం. అదే స్థాయిలో సీఎం రేవంత్, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కూడా ప్రిపేర్ అవుతున్నారట. ఐతే.. బీఆర్ఎస్ నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు వస్తారా..? లేదంటే యధావిధిగా?హరీష్‌రావు, కేటీఆర్‌తోనే బండి లాగించేస్తారా అన్న విషయంలో మాత్రం ఆ పార్టీ వైపు నుంచి ఇంకా క్లారిటీ రాలేదు. ఇప్పటి వరకు కేసీఆర్ సభకు పూర్తిస్థాయిలో వచ్చింది లేదు. దీంతో కాళేశ్వరంపై చర్చకు అయినా వస్తారా..? లేదా అన్నది చూడాలంటున్నారు పరిశీలకులు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించాక రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఇక్కడి స్థాయిలోనే విచారిస్తారా? లేక కేంద్ర దర్యాప్తు సంస్థల దాకా వెళ్తారా అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# మళ్లీ తెరపైకి ఇచ్చంపల్లి

కరీంనగర్, ఆగస్టు 28 కాళేశ్వరం వల్ల తెలంగాణకు లాభం లేదని.. దానివల్ల విపరీతమైన ఖర్చు అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగానే ఖర్చు లేకుండానే.. తెలంగాణలో మెజారిటీ పంట పొలాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే నిజాం కాలం నాటి ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చింది. ఇంతకీ ఆ ప్రాజెక్టు ఏమిటి? నిజాం కాలంలోనే ఫ్రెంచ్ దేశాలు చెందిన ఇంజనీర్లు ఇచ్చంపల్లి ప్రాజెక్టును మొదలుపెట్టారు.. ఆ తర్వాత ఈ ఆగిపోయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. నిజాం కాలంలో ఇచ్చంపల్లి ప్రాంతం వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును పూర్తి చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి గోదావరి జలాలను బీడు భూములకు మళ్ళించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.ఫ్రెంచ్ దేశానికి చెందిన 30 మంది ఇంజనీర్లు.. వేలాది మంది కూలీలు ఇచ్చంపల్లి ప్రాజెక్టు పనుల్లో అప్పట్లో తలమునకలయ్యారు. ఒకవేళ ఆ ప్రాజెక్టు గనుక అప్పట్లో పూర్తయి ఉంటే హైదరాబాద్ నగరానికి నిత్యం తాగునీరు అందేది. అంతేకాదు లక్షల ఎకరాలకు సాగునీరు కూడా అందేది. అయితే అనుకోకుండా ఏర్పడిన అవాంతరాల వల్ల ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. అంతు చిక్కని వ్యాధి సోకి ఇంజనీర్లు, కూలీలు చనిపోయారు. ఇక ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పనులు మొదలు కాలేదు. అయితే ఇప్పటికి నాటి కట్టడాలు కనిపిస్తూనే ఉన్నాయి.. ముఖ్యంగా చత్తీస్ గడ్ వైపు నిర్మించిన బండ్ అత్యంత బలంగా కనిపిస్తోంది.నదులను అనుసంధానం చేయాలని ఇటీవల కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇక్కడి జీవ నదులను అనుసంధానం చేయాలని భావిస్తున్నారు.. ఇందులో భాగంగానే ఇటీవల ఇంజనీర్లు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టుతో పాటు ములుగు జిల్లా మంగపేట మండలం రాంపురం, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. అయితే నాడు ఫ్రెంచ్ ఇంజనీర్లు డిజైన్ చేసిన ఎత్తిపోతల పథకం నేటికీ అనుకూలంగానే ఉందనే భావన సాగునీటి రంగ వ్యక్తమవుతోంది. అయితే నాటి కట్టడాలను పునరుద్ధరించి.. ఇప్పటి కాలానికి అనుగుణంగా ఆధునికరించి గోదావరి జలాలను బీడు భూములకు మళ్ళించాలనేది రేవంత్ ప్రభుత్వం ప్రతిపాదనగా ఉన్నట్టు తెలుస్తోంది.మరోవైపు గోదావరి నది మీద నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నది నీళ్లు మాత్రమే ఆధారం. ప్రాణహిత ప్రవాహం వల్ల మేడిగడ్డ ప్రాంతంలో 2,843 ఎటఅ ల మీరు అందుబాటులో ఉంటుంది. ప్రాణహిత తరహాలోనే ఎంత చెప్పండి ప్రాంతం ఎగువన 108 మీటర్ల దూరంలో ఇంద్రావతి నది గోదావరిలో కలుస్తుంది. పూర్తిగా అడవి ప్రాంతం నుంచి వస్తున్న ఇంద్రావతి నది ప్రవాహం వృధాగా సముద్రంలో కలుస్తోందని నిపుణులు చెబుతున్నారు. ప్రాణహితతో పాటు ఇంద్రావతి నది ప్రవాహాన్ని కూడా పూర్తిస్థాయిలో వాడుకుంటే తెలంగాణలో కరువు అనేది ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించి.. ఆ నీటిని నాగార్జునసాగర్ వైపు తరలిస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఇచ్చంపల్లి వద్ద 600 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని సాగునీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కృష్ణా నది పరివాహకంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు.. గోదావరి పరివాహక ప్రాంతంలో మాత్రం వర్షాలు మెండుగా ఉంటున్నాయి. అందువల్లే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మించి.. తద్వారా ఆ నీటిని కృష్ణా నదికి మళ్లిస్తే నీటి కొరతను తగ్గించవచ్చనేది సాగునీటి రంగ నిపుణుల అభిప్రాయం.. ఇంద్రావతి నదికి 116 మీటర్ల దూరంలో ఉన్న భూపాలపల్లి జిల్లా పలిమెల ఆరంపల్లి వద్ద అప్పట్లో ఫ్రెంచ్ ఇంజనీర్లు గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించారు.

# ఓట్ చోరీ... సీట్ చోరీ...

కరీంనగర్, ఆగస్టు 28 వ్యవహరించిన తీరు హాట్ టాపిక్ అయ్యింది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ చేపట్టిన కాంగ్రెస్ జనహిత యాత్ర చొప్పదండిలో జరిగింది. యాత్రకు మంచి రెస్పాన్స్ వచ్చిందని పార్టీ నేతలు కూడా ఖుషీగా ఉన్నారు. అంతా సాఫీగా సాగిందని హస్తం పార్టీ రాష్ట్ర నేతలు సంబరపడుతున్న టైంలో.. జీవన్‌రెడ్డి ఎపిసోడ్‌తో అంతా రివర్స్ అయినట్టు ఫీలవుతున్నారట. టూర్ ప్రోగ్రామ్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నేతలు తాజా స్థితిగతులు ప్రతిపక్షాల పరిస్థితిని చెప్పగా.. జగిత్యాల నేతలు మాత్రం ఆత్మస్తుతి- పరనింద అన్నట్టుగా జీవన్‌రెడ్డిని పొగుడుతూ? మిగతా వాళ్ళను విమర్శిస్తూ మాట్లాడారు. వారిని సముదాయించి సమావేశాన్ని ముగించి బయటకు వెళుతున్న టైంలో.. జీవన్‌రెడ్డి సహా జగిత్యాల కార్యకర్తలు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను రౌండప్ చేసి.. తమకు అన్యాయం జరిగిందని నిలదీశారట. అక్కడితో ఆగకుండా.. మీరు ఓట్ చోరీ గురించి మాట్లాడుతున్నారు, జగిత్యాలలో అసలు సీట్ చోరీ జరిగిందనే మాటేంటని నిలదీయడంతో పీసీసీ అధ్యక్షుడు షాకైనట్టు సమాచారం.పక్కనే ఉన్న జీవన్‌రెడ్డి కూడా కార్యకర్తలను వారించాల్సిందిబోయి.. వారిని రెచ్చగొట్టే విధంగా మాట్లాడారట. జెండాలు మోసిన మేము అన్యాయం అవుతున్నామని అనడంతో మరింత రెచ్చిపోయారు కార్యకర్తలు.. ఈలోగా ఇతర నేతలు కలగజేసుకున్నా?అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది? జీవన్‌రెడ్డి అనుచరుల సీట్ చోరీ వ్యాఖ్యలు ప్రతిపక్షానికి ఆయుధంగా మారాయి. మీటింగ్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని టార్గెట్ చేసిన మహేష్ గౌడ్‌కు సొంత పార్టీ నేతల వల్ల సెల్ఫ్ గోల్ చేసుకున్నట్టయిందట. అటు బండి కూడా అదే కామెంట్‌ను బేస్ చేసుకుని పీసీసీ అధ్యక్షుడి మీద అటాక్ చేశారు. దీంతో తమ యాత్ర బాగా జరిగిందన్న సంతోషం లేకుండా చేశఆరంటూ.. జీవన్‌రెడ్డి మీద రగిలిపోతున్నారట రాష్ట్ర కాంగ్రెస్ నేతలు. అయితే జీవన్‌రెడ్డికి ఇలా సొంత పార్టీని ఇరుకున పెట్టడం కొత్తేమీ కాదు.. ఓ రెండు నెలలు మౌనంగా ఉండటం.. ఉన్నట్టుండి? ఒక్కసారిగా ఏదో బాంబు పేల్చడం కామన్‌గా మారిందట పెద్దాయనకు. ఈ మధ్య వీలుచిక్కిన ప్రతీసారీ తన అసంతృప్తిని వెళ్లగక్కుతూ.. నా ఉనికిని గుర్తించండి అన్నట్టుగా అధిష్టానానికి సంకేతాలు ఇస్తున్నారట.సూపర్ సీనియర్ నేతగా పేరున్న జీవన్‌రెడ్డే ఇప్పుడు పార్టీకి తట్టుకోలేని తలనొప్పిగా మారారని చెవులు కొరుక్కుంటున్నారట పార్టీ నాయకులు. అసలే పెద్దమనిషి అప్పట్లో ఎమ్మెల్సీ కాబట్టి పార్టీ నేతలు కూడా మొదట్లో సీరియస్‌గా తీసుకుని పెద్దలు జీవన్‌రెడ్డి గారు అంటూ బుజ్జగింపుల పర్వం స్టార్ట్ చేసి ఆయనకు ఏదో ఒక ప్రామిస్ చేసి కూల్ చేసేవారు. రాను రాను అదే అలవాటుగా మారిపోవడంతో.. కాంగ్రెస్ ముఖ్యులు కూడా లైట్ తీసుకుంటున్నట్టు సమాచారం. దీంతో బహిరంగంగానే ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారన్న చర్చ జరుగుతోంది. అన్ని విషయాల్లోనూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కే ప్రాధాన్యత దక్కుతుండటంతో ఏం చేయాలంటూ.. దీర్ఘాలోచనలో పడ్డారట జీవన్‌రెడ్డి. అలా వచ్చిన ఆలోచనల నుంచే ఇలా రాష్ట్ర నేతలను ఇరుకున పెట్టాలనే ప్రణాళికలు అమలు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది జగిత్యాలలో.రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులపై ఓవైపు హాట్‌హాట్‌గా చర్చ సాగుతున్న తరుణంలో ఈ ఎపిసోడ్ ఎటు దారితీస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అటు లోకల్ బాడీస్ ఎన్నికలకు సిద్ధమవుతున్న క్రమంలో? నియోజకవర్గంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై అప్పర్ హ్యాండ్ సాధించేందుకు కూడా జీవన్‌రెడ్డి కొత్త ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారట. అందులో భాగంగానే సమావేశంలో దృష్టిని తనవైపు మళ్లించుకునేందుకు కార్యకర్తలను ఇలా ప్రయోగించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సమావేశానికి ఎమ్మెల్యే సంజయ్ దూరంగా ఉన్న విషయాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపేందుకు? ఇటు పార్టీలో తనకు ఫాలోయింగ్ ఉందని చెప్పేందుకు ఈ వేదికను వాడుకున్నట్టు చెప్పుకుంటున్నారు. కానీ.. జీవన్‌రెడ్డి తీరుపై రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్, పీసీసీ ఛీఫ్ గుర్రుగా ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయట.. ఆయన జగిత్యాలలో రాజేసిన మంటలు చల్లార్చేందుకు పార్టీ పెద్దలు ఎలా వ్యవహరిస్తారనేది ఆసక్తిగా మారింది.

# ముంబై సమీపంలో పెను విషాదం..

## భవనం కూలి 14 మంది మృతి!

## విరార్‌లో కుప్పకూలిన నాలుగంతస్తుల భవనం

## పక్కనే ఉన్న చాల్‌పై పడిన అపార్ట్‌మెంట్ శిథిలాలు

## గతంలోనే ప్రమాదకరమైనదిగా ప్రకటించిన మున్సిపల్ అధికారులు

## రాత్రంతా కొనసాగిన ఎన్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు

## శిథిలాల కింద మరికొందరు వుండచ్చనే ఆందోళన

మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ముంబై సమీపంలోని విరార్ ప్రాంతంలో నాలుగంతస్తుల నివాస భవనం ఒకటి కుప్పకూలిన ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది.సుమారు పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని 'అత్యంత ప్రమాదకరమైనది'గా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గతంలోనే గుర్తించి హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. శిథిలాల కింద ఇంకా 10 నుంచి 11 మంది వరకు చిక్కుకొని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

# రామగుండం లో భారీ వర్షం

## సింగరేణి క్వారీలు జలమయం

రామగుండం పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రామగుండం లోని 1,2,3,5, ఓపెన్ కాస్ట్ లలో బొగ్గు ఉత్పత్తి కి ఆటంకం ఏర్పడింది. క్వారీలోకి నీరు చేరాయి, క్వారీకి వెళ్లే రోడ్లన్ని బురదమయం కావడంతో సుమారుగా రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి కి విఘాతం కలిగింది. వర్షంతో భారీ వాహనాలు డంపర్లు,షావల్స్, ఎక్కడిక్కడ నిలిచిపోయినాయి. ఓసిపిల నుండి బొగ్గు ఉత్పత్తి తగ్గటం తో, ఎన్టీపీసీకి గ్రౌండ్ స్టాక్ బొగ్గు రవాణాను సింగరేణి యాజమాన్యం చేస్తుంది.

# భారీ వర్షాలకు సిద్దిపేట జిల్లా అతలాకుతలం

సిద్దిపేట భారీ వర్షాలకు సిద్దిపేట జిల్లా అతలాకుతలం అయింది. మిరుదొడ్డి (మం) రుద్రారం గ్రామాన్ని వరద ముంచెత్తింది. గ్రామానికి వెళ్లే రెండు దారులు బంద్ అయ్యాయి. జలదిగ్బంధంలో తొగుట (మం) వెంకట్రావుపేట గ్రామం చిక్కుకుంది. గ్రామానికి వచ్చే మూడు దారులు బంద్ అయ్యాయి. తొగుట (మం) లింగపూర్ వద్ద మల్లన్నసాగర్ కాలువ తెగిపోయింది. పంట పోలాలు నీట మునిగాయి. రోడ్లపై వరద నీరు ఉద్భతంగా ప్రవహిస్తుంది. చేర్యాలలో తాడూరు వాగు ఉధృతికి ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల వద్ద ఉన్న పశువులను రక్షించేందుకు వెళ్లి ఏడుగురు రైతులు వరదల్లో చిక్కుకున్నారు. అక్బర్ పేట భూంపల్లి (మం) పోతారెడ్డిపేటలో పొలానికి వెళ్లి వాగులో ముగ్గురు రైతులు చిక్కుకున్నారు. రాత్రంతా వాగులోనే రైతులు గోపాల్, సుదర్శన్, రాజు వుండిపోయారు. ఊర చెరువు పొంగడంతో ప్రజ్ఞాపూర్-గజ్వేల్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచింది. ప్రజ్ఞాపూర్ వద్ద హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారిపై వర్షపు నీరు ట్రాఫిక్ కు అంతరాయం కలిగించింది. మర్కుక్ లో కొండపోచమ్మ సాగర్ కాలువ కొట్టుకుపోయింది. తోగుట (మం) చందాపూర్ గ్రామంలో ఇండ్లలోకి వరద నీరు చేరింది. దాంతో గ్రామస్తులు రాత్రంతా జాగారం చేసారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం సేవలు వినియోగించుకోవాలి - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

24/7అందుబాటులో..వివిధ శాఖల అధికారులు..
ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు
వరద, వర్షం ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 1495
కంట్రోల్ రూమ్ వాట్సాప్ సెల్ నెంబర్ 9398684240



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగష్టు 28 (ప్రజాబలం ప్రతినిధి)**రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలలో లో లెవెల్ కాజ్ వే ల వద్ద అప్రమత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, హెల్త్, పి.ఆర్, మిషన్ భగీరథ ఇతర శాఖల అధికారులు కంట్రోల్ రూంలో సేవలు అందిస్తున్నారని తెలిపారు.వివిధ అధికారులు అందుబాటులో ఉండి, వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు తగిన సమాచారం అందిస్తారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేసేలా సేవలు అందిస్తారు. 24 గంటలు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్లు టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 1495, వాట్సాప్ సెల్ నెంబర్ 9398684240 లను వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజలకు సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ, తమ హెడ్ క్వార్టర్స్ , క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రా వద్దని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలి కేటీఆర్



హైదరాబాద్ భారత రాష్ట్ర సమితి (ఃఖీ) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర సీనియర్ నేతలతో కేటీఆర్ మాట్లాడారు.
రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలపై కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు, సహాయక చర్యల్లో పూర్తిగా విఫలమైందని ధ్వజం ఎత్తారు. కేటీఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వర్ష సూచన ఆధారంగా అనేక సూక్ష్మమైన అంశాలపై దృష్టి పెట్టేవాళ్ళం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, విభాగాలతో నిరంతర సమన్వయం చేసుకుంటూ పనిచేసేవాళ్ళమని అన్నారు. దురదృష్టవశాత్తు, ఈ ప్రభుత్వం మనం స్పందించి ఒత్తిడి తీసుకువచ్చే వరకు కూడా పెద్దగా స్పందించడం లేదని అన్నారు. ప్రజల వెంట నిలబడే పార్టీ మనది కాబట్టి, కార్యకర్తలు ప్రజల కష్టాల్లో అండగా నిలబడాలి. కార్యకర్తల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరూ సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలి. వరదల్లో చిక్కుకున్న వారికి, వర్షాల వల్ల నష్టపోయిన వారికి తక్షణ సహాయం అందించాలి. తీవ్రమైన వరద ఉన్నచోట ఆహారం, తాగునీరు వంటి నిత్యావసరాలు అందించాలి. బురద నిండిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అవసరమైతే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, వ్యాధులు ప్రబలకుండా చూడాలని అన్నారు.
మనం చేసే ప్రతి సహాయకార్యాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్ళి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.

# మెదక్ జిల్లా ముంపు ప్రాంతాలను పర్యటించిన మాజీ మంత్రి హరీష్ రావు



మెదక్ మాజీ మంత్రి హరీష్ రావు గురువారం నాడు జిల్లాలోని ముంపు ప్రాంతాలలో పర్యటించారు. రాజి పెట గ్రామం లో వరద ప్రవాహంలో గల్లంతు అయిన ప్రాంతాన్ని సందర్శించారు. రాజి పెట గ్రామంలో వరదలో చిక్కుకొని చనిపోయిన సత్యం కుటుంబాన్ని పరామర్శించారు.
హరీష్ రావు మాట్లాడుతూ మెదక్, కామారెడ్డి వరద ప్రవాహంలో ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రి మూసి సుందరీ కరణ, ఆటల పోటీల అంశంపై రివ్యూ చేస్తున్నారు. ఒక మంత్రి అయితే అత్యవసరమైతే తప్ప హెలికాప్టర్ వాడలేము అని అంటున్నారు. మెదక్ జిల్లా రాజాపేట్ వరదల్లో చిక్కుకొని ఇద్దరు కరెంటు పోల్ ఎక్కి నాలుగైదు గంటలు గా సహాయం కోసం ఎదురుచూసారు. హెలికాప్టర్ పంపించి ఉంటే వాళ్ళు ప్రాణాలతో దక్కేవారు. చనిపోయిన రెండు కుటుంబాలకు 25 లక్షల ఆర్థిక సహాయం చేయాలి. నష్టపోయిన పంట పొలాలకు ఎకరానికి 25000 చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మెదక్ ముంపు ప్రాంతాలకు ప్రజలు సహాయక చర్యల కోసం ఎదురుచూస్తున్నారు. తాగునీరు లేకపోవడంతో వర్షం నీరు తాగుతున్నారు. ధూప్ సింగ్ తాండా ప్రజలు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతర సమీక్ష

భారీగా నష్టపోయిన జిల్లాకు అదనంగా నిధులు
యుద్ధ ప్రాతిపదికన రవాణా సౌకర్యం పునరుద్దరణ
శవాలపై చిల్లర ఏరుకొనేలా బిఆర్ఎస్ వ్యవహారం
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ :- రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరద పరిస్థితులు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొద్ది సమయంలోనే ముఖ్యంగా మెదక్, కామారెడ్డి ఆదిలాబాద్ జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో వర్షపాతం నమోదైందన్నారు. అయినా కూడా ప్రాణ నష్టం, ఆస్తినష్టం వీలైనంత మేరకు తగ్గించేలా చర్యలు తీసుకున్నామన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సూచనల మేరకు బుధవారం మధ్యహ్నం నుంచే పరిస్థితిని సమీక్షించామని వెల్లడించారు. వరదల్లో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. సిరిసిల్ల జిల్లాలోని నర్మల గ్రామం వద్ద బుధవారం నాడు మానేరు వాగు వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించామని తెలిపారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వారం రోజుల క్రితమే కోటి రూపాయిల చొప్పున నిధులు విడుదల చేశామని, ప్రస్తుతం అతి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న జిల్లాలకు అదనంగా ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని తెలిపారు.

భారీ వర్షాలతో స్థంభించిన జాతీయ రహదారితోపాటు పంచాయితీరాజ్, ఆర్ %డ%బీ రోడ్లను క్లియర్ చేశామని, దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా పునరుద్దరిస్తున్నామని తెలిపారు. పలు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు రహదారి సౌకర్యాలు దెబ్బతిన్నాయని వీటిని వెంటనే పునరుద్దరించేలా ఆదేశించామన్నారు. జిల్లాల్లో రెవెన్యూ. పోలీసు యంత్రాంగం చిత్తశుద్ధితో 24%శ%7 పనిచేస్తున్నాయని తెలిపారు.

గురువారం నాడు విపత్తుల నిర్వహణా శాఖ అధికారులతో మంత్రిగారు సమీక్షించారు. అలాగే మెదక్ కామారెడ్డి సిరిసిల్ల నిర్మల్ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

వర్షాలు వరదలపై ఆయా జిల్లాల యంత్రాంగంతో నిరంతరం మానిటరింగ్ చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్షాలతో చనిపోయిన వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో వర్ష బీభత్సం దృష్ట్యా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు పని చేస్తున్నాయని, అవసరాన్ని బట్టి హెలికాప్టర్‌ల ద్వారా బాధితులను ఆదుకోవడానికి సిద్ధం చేశామని వివరించారు. కూలి పోయిన ఇండ్లు, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రిగారు ప్రకటించారు.

ఒక్క మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవలం ఒక గంట వ్యవధిలో 700 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నీటి వనరులు పూర్తిగా నిండిపోయాయని, వాటని నుంచి ఉధృతంగా నీరు బయటకు వెళ్లడంతో గట్లు దెబ్బతిని తీవ్ర నష్టాన్ని కలిగించిందని వివరించారు.మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని తండాలు మరీ ఎక్కువగా వర్ష బీభత్సానికి గురయ్యాయని, ఈ తండాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించేలా అధికారులను ఆదేశించామన్నారు. వర్షాల తర్వాత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖకు సూచించామన్నారు.

రాష్ట్రంలో ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. ప్రతిపక్షమైన బి.ఆర్. ఎస్ రాజకీయ లబ్దికోసం మాట్లాడడం



సరికాదన్నారు. వారి పాలనలో వరదలొస్తే నాడు ఏం చేశారో.. నేడు ఏం జరుగుతుందో కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు. శవాల మీద చిల్లర ఏరుకునే వ్యవహారం చేయవద్దని, ఉపయుక్తమైన సలహాలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** విద్యుత్ ఉద్యమ అమర వీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన ప్రభుత్వ ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికూమార్ పీసీసీ ఉపాధ్యాక్షులు కూమార్ రావ్ తదితరులు

# జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదేశించారు.
భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత జిల్లాల వైద్య శాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో టెలిఫోన్లో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలలో వర్షాలు అధికంగా కురుస్తున్న మెదక్ , కామారెడ్డి , సంగారెడ్డి , సిరిసిల్లా, సిద్దిపేట లతో పాటు ఇతర జిల్లాలలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అదికారులను అదేశించారు.
లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలన్నారు . స్నేక్ బైట్ లు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి అదేశించారు. వచ్చే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను అదేశించారు.
డాక్టర్లు, నర్సింగ్ స్టాప్ , ఫార్మాసిస్ట్ లు, అసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి అదేశించారు.
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ప్రజలకు తక్షణ వైద్య సాయం అందించటం పై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిరంతరం జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను అదేశించారు.
లోతట్టు ప్రాంతాలలో వర్ష ప్రభావానికి గురైన ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, అంటు వ్యాధులు ప్రభలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు తీసుకోవటానికి పురపాలక, పంచాయితీ శాఖ ల అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. వైద్య , ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ అధికారులను అదేశించారు. రెవిన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయితీ, డిజాస్టర్ మెనేజ్మెంట్ అధికారులతో సమన్వయం చేసుకోని అధిక వర్షా ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి అదేశించారు.

# భారీ వర్షాల దృష్ట్యా ప్రజల రక్షణ దిశగా చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల రక్షణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీరంలో వరద ఉధృతిని ఎం పి డి సి ఎల్ ఎస్.ఈ. తో కలిసి పరిశీలించి, మాత శిశు ఆసుపత్రిని సందర్శించి ఆర్.ఎం.ఓ.లు భీష్మ,శ్రీధర్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రా రెడ్డి లతో కలిసి గర్భిణులు,పిల్లల సంరక్షణకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద నీరు గోదావరి నదిలో ఉధృతంగా ప్రవహిస్తుందని తెలిపారు. పైన కురిసిన వర్షాల కారణంగా ఎస్.ఆర్.ఎస్.పి. ప్రాజెక్టు నుండి 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు, కడెం ప్రాజెక్టు నుండి 50 వేల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు లోనికి ఇన్ ఫ్లో పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నదీ తీరం సమీపంలో ఉన్న మాతా శిశు ఆసుపత్రి నుండి గర్భిణులు, పిల్లలను ముందస్తు జాగ్రత్త చర్యగా ప్రభుత్వ ఆసుపత్రి, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రికవర్ అయిన వారిని వారి అభిప్రాయం మేరకు డిశ్చార్జ్ చేయడం,వేరే ఆసుపత్రికి తరలించడం జరుగుతుందని, ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. 3,4 రోజులలో వర్షం లేకపోతే నీరు తగ్గిపోతుందని, ప్రతి సంవత్సరం ప్రజల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి,ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మాత శిశు ఆసుపత్రిలో 139 మంది గర్భిణీలు, పసిపిల్లలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. జిల్లాలోని జన్నారం,దండేపల్లి, భీమిని, తాండూర్,కోటపల్లి మండలాలలో అధిక వర్షపాతం నమోదు అయిందని,ఆయా మండలాలలో లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగింది తెలిపారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,నదుల వద్దకు ఎవరు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న ఇందిరా మహిళ భవన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు జలాశయం 18 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వర జలాశయం ( మిడ్ మానేరు ) నుండి అధికారులు 18 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

వరద నీటి ప్రవాహం దృశ్య సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

మిడ్ మానేరు జలాశయానికి వరద నీటి ప్రభావం పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

వాగులు, వంకలు, కాల్వల దగ్గరికి వెళ్లరాదని, పిల్లలను ప్రత్యేక జాగ్రత్త తీసుకోవాలని అధికారులు సూచించారు.

అధికారుల పర్యవేక్షణలో నీటిమట్టం నిరంతరం పరిశీలన లో ఉందని తెలియజేశారు.

# చందుర్తి మండలం లో భారీ వర్షాలు, వరద ముంపు నేపథ్యంలో పోలీసుల భద్రతా చర్యలు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** చందుర్తి మండలం లో బుధవారం రోజు నుండి భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ పరిస్థితిని పరిశీలించడానికి చందుర్తి ఎస్సై జె. రమేష్, చందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు కలిసి మల్యాల, మూడపల్లి, తిమ్మాపూర్, ఎనుగంటి గ్రామాలను సందర్శించారు. కల్వర్టులు, వాగుల వద్ద వరద ముంపు ఉండడంతో భారీకేడ్లు, తాడును ఏర్పాటు చేసి భద్రత చర్యలు చేపట్టారు. కల్వర్టుల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి, పహారా కాసేలా సూచనలు ఇచ్చారు. మండలంలోని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దు అని పోలీసులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులలో వెంటనే పోలీసులను సంప్రదించాల్సిందిగా సూచించారు. మండలంలోని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..



**కూకట్పల్లి (ప్రజాబలం) ఆగస్టు 28:** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ నర్సింహ రాజు తెలిపారు. సీఐ నర్సింహా రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిక్షాటన చేస్తూ జీవనం సాగించుకొనే వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి శవ పరీక్ష నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించినట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై నల్లటి ప్యాంటు, నీలి రంగు షర్ట్ ధరించి, సుమారు 45నుంచి 50ఏళ్ల వయస్సుగల వ్యక్తిగా నిర్ధారించారు. ఈ మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

# అంజనీ పుత్ర ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

## అన్నదాతా సుఖీభవ అంటూ భక్తుల ఆశీర్వచనాలు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 :** మంచిర్యాల వినాయక నవ రాత్రోత్సవాల్లో మొదటి రోజు న అన్న దానం 2000 వేల మందికి పైగా ఘనంగా అన్నదానం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రజలు అన్నదాతా సుఖీభవ అంటూ భక్తుల ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్,మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి మాట్లాడుతూ... అన్ని దానాల్లో అన్న దానం గొప్పదని. సామాజిక కార్యక్రమాలలో అంజనీ పుత్ర సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో అంజనీ పుత్ర అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. దాదాపు వినాయక ప్రతిమ ప్రతిష్ఠించిన ప్రతిచోటా అన్నదానం తప్పనిసరయింది. జనాభా సంఖ్యకు అనుగుణంగా భారీగానే అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లుసూరినేనీ కిషన్,కాసర్ల సదాందం,డైరెక్టర్ లు, సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు. విందు భోజనాలు నోరూరించే హల్వా, జిలేబీ, ఒకవైపు,చింతపండుతో చేసిన పులిహోర మరోవైపు. ఔరా అనిపించేలా వంకాయ మసాలా ఇంకో స్పెషల్,ఇక వెజ్ బిర్యానీ, పాలకూర పప్పు,మిక్స్డ్ వెజిటేబుల్ కర్రీ,సాంబార్,పెరుగు, టమాట,దోసకాయ చట్నీలు,పాపడాలు..ఇదీ వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాల్లో కనిపిస్తున్న మెనూ. వంటల విషయంలో అంజనీ పుత్ర సంస్థ ఎక్కడా తగ్గడంలేదు. అందుకు తగ్గట్టు భారీగా ఏర్పాట్లు చేసారు. చిన్న చిన్న గల్లీల్లో 1500 నుంచి 2000 మందికి భోజనాలు వడ్డించేందుకు ఏర్పాట్లు చేసారు. భక్తులకు కడుపునిండా వడ్డించేందుకు ఘనంగా ఏర్పాటు చేసి వడ్డించారు. జిల్లా వ్యాప్తంగా అంజనీ పుత్ర గణపతి మండపం గురించి ప్రత్యేకంగా చర్చించుకునేలా వసతులు కల్పిస్తున్నాయి. ఈ కార్యక్రమం స్థానిక విగ్నేశ్వర భక్తులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడు పూజలో పాల్గొన్న దేవభక్తుని కిషోర్ బాబు దంపతులు



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాబలం)** వినాయక చవితి పర్వదినం సందర్భంగా నిత్య జరిగే పూజా కార్యక్రమంలో గోపాల పురం 8వ డివిజన్ లో బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు, సూపర్ స్టార్ మహేష్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు – విజయ దంపతులు స్వగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవభక్తుని కిషోర్ బాబు మాట్లాడుతూ ఈ నవరాత్రులలో ప్రజలందరూ ప్రత్యేక భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రజలందరూ సుఖ ఉండాలని కోరారు ఈ సందర్భంగా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమానికి భక్తులు బంధువులు పెద్ద ఎత్తునపాల్గొన్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# కొర్విచెల్మ గ్రామంలో రైతుల పొలాలపై వరదలైపడుతున్న వరదనీరు




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామంలో రైతుల పొలాలపై వరదలైపడుతున్న వరద నీరు,రైతులకు ఎంతో నష్టమని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...అకాల వర్షం కారణంగా గ్రామంలో వరి పంట పొలాలు మాకు ఎంతో నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ ఖర్చు,నాటు కర్చు,పొలాలపై వేసిన మందులు,ఎంతో నష్టమని,అంతేకాకుండా ఇప్పుడు ఏమైనా ఎద్దామంటే వరినారులేదు వేరే పంట వేయలేం,మా బాధను అర్థం చేసుకొని,సంబంధిత అధికారులు,సర్వే నిర్వహించి, మాకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరడమైనది.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- అధికారులు తక్షణమే వరద ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలి.
- అధికారులతో నేరుగా ఫోన్ లో సంభాషించిన ప్రణవ్.
- కాలనీల్లో వరద పరిస్థితి,వర్షాలపై ఆరా
- అవసరమైతే తప్ప బయటికి ఎవరు వెళ్లకూడదు.
- వినాయక మండపాల వద్ద జాగ్రత్తగా ఉండండి.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28** రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వరద ప్రభావిత ప్రాంతాలపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఈ మేరకు గురువారం ఉదయం 2 పట్టణాల కమిషనర్లు,వివిధ మండలాల అధికారులతో ఫోన్ లో సంభాషించారు. వీలైనంత వరకు వరద నీరు నిలవకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు వినాయక మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరించాలని,కరెంట్ స్తంభాలు ఇతరత్ర సరి చూసుకోవాలనీ,రైతులు కరెంట్ పెట్టే సమయంలో చూసుకోవాలని కోరారు. వాతావరణ అధికారుల సూచన మేరకు మరో మూడు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప ఇంట్లో నుండి బయటికి ఎవరు రాకూడదని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు కూడా తగిన సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని కోరారు.

## వరద పరిస్థితుల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 :** వర్షపాతం కారణంగా వరద పరిస్థితుల దృష్ట్యా అధికార యంత్రాంగం ప్రజా సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల గోదావరి నది తీరం, మాతా శిశు ఆసుపత్రి పరిసరాలను ఆర్.ఐ.శిరీషతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో వరద పరిస్థితులు ఏర్పడనున్న దృష్ట్యా ప్రజల రక్షణ కొరకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు ఎవరు అటువైపుగా వెళ్లకుండా బందోబస్తు చర్యలు చేపట్టాలని, రెవెన్యూ, పోలీస్,మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 08736- 250501 ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటున్నామని, అత్యవసర సేవల నిమిత్తం పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నానని తెలిపారు.ఆసుపత్రికి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని, వైద్యులు,సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు.అనంతరం హాజీపూర్ మండలం పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టును మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించి ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీటి వివరాలను ఎల్లంపల్లి డి.ఈ.ఎ.ఈ. లను అడిగి తెలుసుకున్నారు. వరద నీటి ఇన్ ఫ్లో అధికంగా ఉన్నందున అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని తెలిపారు. అత్యవసర చర్యల కొరకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వర్షపు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్,దోమల మందు పిచికారి చేయాలని తెలిపారు. ముల్కల్ల లోని గోదావరి నది తీరాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, 1000/- జరిమానా.

**జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదు, శిక్షలతోనే సమాజంలో మార్పు.**

**నిందితుడికి శిక్ష పడటంతో కృషి చేసిన అధికారులను, పి పి, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ.**

**హత్యకు కారణమైన నిందితుడికి జీవిత ఖైదు, 1000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ముస్తాబాద్ మండలం కొండాపూర్ కు చెందిన సిర్రం మహేష్ తండ్రి రాజా రామ్ వయస్సు (46) అనే వ్యక్తి వేములవాడలో కిరాయికి ఉంటూ కూలీ చేసుకుంటున్నాడు. అతనికి దర్ర తిరుపతి తో పరిచయం ఏర్పడి తన రూమ్లో ఉంచుకొనగా దర్ర తిరుపతి మద్యంకు బానిసై, రూమ్ రెంటు ఇవ్వకుండా మరియు సిర్రం మహేష్ ని వేధించగా సిర్ర మహేష్ రెంట్ కట్టి మద్యం త్రాగకుండా ఉంటేనే రూమ్ లో ఉండు లేదు అంటే రూమ్ నుండి బయటకు వెళ్లగొడతా అని అందరి ముందు అన్నందుకు, దర్ర తిరుపతి అందరి ముందు నా పరువు తీసిన మహేష్ ను ఎలాగైనా చంపాలి అనే ఉద్దేశంతో 1-04-2024 రోజున రూములో సిర్ర మహేష్ పడుకున్న సమయంలో దర్ర తిరుపతి పెద్ద సిమెంట్ రాయితో మహేష్ తలపై బాధి చంపాడు.

ఈ కేసులో మహేష్ భార్య అయినటువంటి పద్మ ఫిర్యాదు మేరకు అప్పటి వేములవాడ టౌన్ పోలీస్ కేసు నమోదు చేసి రెండిటిని రిమాండ్ కు పంపించడం జరిగింది. తర్వాత సిఐ వీరప్రసాద్ కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది.

కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సి ఎం ఎస్ కానిస్టేబుల్ నవీన్ లు కోర్టులో 17 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడైన ధర్ర తిరుపతికి జీవిత ఖైదీతో పాటు,1000/- రూపాయల జరిమానా విధించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరు శిక్ష నుండి తప్పించుకోలేరని శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా కృషి చేస్తారని సూచించారు. పై కేసులో నిందితులకు శిక్ష పడడంలో కృషిచేసిన అప్పటి విచారణ అధికారి, ప్రస్తుత వేములవాడ టౌన్ సిఐ వీరప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సి ఎం ఎస్ కానిస్టేబుల్ నవీన్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## రాజన్నను దర్శించుకున్న మంత్రి ఆడ్లూరి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్ టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం రోజున శ్రీ రాజరాజేశ్వరా స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించడంతోపాటు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించినారు.

తదనంతరం కళ్యాణమండపంలో వేద పండితులు మరియు ఆలయ అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనాలు అందించారు. మంత్రికి ఆలయ కార్యనిర్వాహణాధికారి రాధాబాయి స్వామి వారి శేష వస్త్రం సమర్పించి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో సహాయ కార్య నిర్వహణ అధికారికి శ్రవణ్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ పరిశీలకులు నూగురి నరేందర్, ఫోటో కాల్ సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్, జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు మరియు ఇతర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల లో స్కూళ్లకు సెలవు

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా భారీ వర్షంతో గురువారం స్కూళ్లకు సెలవు ప్రకటించారు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ. వర్షం కారణంగా వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులు లేక నిర్మానుష్యంగా మారింది. క్యూ లైన్లు బోసి పోయాయి. జన జీవనం స్తంభించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 1495. కంట్రోల్ రూమ్ వాట్సాప్ సెల్ నెంబర్ 9398684240

## వరదలో చిక్కుకున్న బాధితులు క్షేమం.

**బాధితులతో మాట్లాడిన రాష్ట్ర ప్రభుత్వ విప్.**

**బాధితులను స్వయాన తన కారులో ఎక్కించుకొని ఆసుపత్రికి తరలించిన విప్ ఆది.**

**బాధితులకు అండగా ఉంటామని హామీ.**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, గంభీరావుపేట, ( ప్రజాబలం ),** గంభీరావుపేట మండలం ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న వారిని క్షేమంగా తరలించినట్లు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. నర్మల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు వెళ్లి ఏడుగురు, అక్కడే చిక్కుకుపోగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయక చర్యలను ముమ్మరం చేసి వారిని ఒడ్డుకు చేర్చారు.

ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఒడ్డుకు చేర్చిన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ బాధితులను స్వయంగా ఆయన కారులో ఎక్కించుకొని ఆసుపత్రికి తరలించారు. వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వరదల్లో గల్లంతయిన నాగయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం కల్పించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## కలెక్టర్, ఎస్పీ గ్రేట్ ఆఫీసర్స్.

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.**

**దగ్గరుండి పర్యవేక్షించి, బాధితులను క్షేమంగా తరలించి.**

**ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన ఏడుగురు క్షేమం.**

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, మంత్రి పొన్నం, విప్ ఆది పర్యవేక్షణ.**

**కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు.**





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, గంభీరావుపేట, ( ప్రజాబలం ),** గంభీరావుపేట మండలం నర్మల ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన ఏడుగురిని దగ్గరుండి పర్యవేక్షించి, క్షేమంగా తరలించారు. ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన వారిని క్షేమంగా ఇంటికి తరలించే వరకు విశేష సేవలు అందించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే గ్రేట్ ఆఫీసర్స్ అని కొనియాడి, వారికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

నర్మల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు వెళ్లిన రైతులు జంగం స్వామి, పిట్ల స్వామి, పిట్ల మహేష్, పిట్ల నరసింహులు, ధ్యానబోయిన స్వామి, మరో ఇద్దరూ బీసె ప్రదీప్, బి సే చాయ అక్కడే చిక్కుకుపోగా, కలెక్టర్, ఎస్పీ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. వరదలలో చిక్కుకున్న వారికి ఆహార సదుపాయం కల్పించారు.

ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన వారిని హకింపేటలోని సైనిక హెలికాప్టర్లలో చేరుకొని క్షేమంగా గమ్యం చేర్చారు.

**ఎప్పటికప్పుడు పర్యవేక్షణ.**

ప్రాజెక్టు వద్ద చిక్కుపోయిన వారి పరిస్థితిపై కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ , రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పుడు ఆరా తీశారు. వారికి సహాయం అందించాలని అధికారి యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం ఉదయమే ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేరుకునే క్షేమంగా చేరుకున్న వారిని పరామర్శించారు.

**క్షేమంగా బాధితులు ఇంటికి.**

ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయి ఇబ్బంది పడుతున్నారు అనే విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే అక్కడికి చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు అక్కడే ఉన్నారు. లింగన్నపేటలో వాగులో చిక్కుకుపోయిన ప్రవీణ్ ను క్షేమంగా ఒడ్డుకు చేర్చే వరకు కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షించి, ఎన్ డి ఆర్ ఎఫ్, బృందానికి సలహాలు సూచనలు అందించారు. గురువారం ఉదయం మళ్లీ ఎగువ మానేరు ప్రాజెక్టు వద్దకు కలెక్టర్,ఎస్పీ చేరుకొని పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించారు. ప్రాజెక్టులో నీటిమట్టం, ఎగువ నుంచి ఎంత వస్తుందని ఆరా తీస్తూ, ప్రాజెక్టు వద్ద చిక్కుపోయిన వారికి మనోధైర్యం కల్పించారు. ఏడుగురు క్షేమంగా గమ్యం చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటన విషయం తెలిసి దగ్గరుండి అందరిని క్షేమంగా తరలించడంలో విశేష కృషి చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే గ్రేట్ ఆఫీసర్స్ అని, వారి అధికార యంత్రంగాన్ని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.

## సిరిసిల్ల జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి.

## అవసరం ఉంటే తప్ప బయటకు రావద్దు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో బుధవారం నుండి కురుస్తున్న అతి భారీ వర్షాల నేపద్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు.

వాగులు, వంకలు పొంగిపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనే ప్రజలు నీటి ప్రవాహాలు ఉన్నచోట రోడ్డు దాటరాదని ఆయన హెచ్చరించారు. రహదారులపై వర్షం నీటి వల్ల రోడ్లు స్కిడ్ అయ్యే అవకాశం ఉండడంతో వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అలాగే కరెంటు వైర్లు, ఎలక్ట్రిక్ స్తంభాలను తాకరాదని, రైతుల పొలాల్లోకి వెళ్లినప్పుడు ట్రాక్టర్లను నేరుగా తాకకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. చెరువులు, కుంటలు నిండుతున్నందున అందులో ఎవరు దిగరాదని హెచ్చరించారు.

ఇంట్లోని చిన్నపిల్లలు బయటకు వెళ్ళినప్పుడు తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే, అత్యవసర నెంబర్లకు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమాచారం అందించాలని తెలిపారు.

# మణికొండలో వర్షాలకు దెబ్బతిన్న రహదారులు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 28 ఆగస్టు 2025**మణికొండ పురపాలక సంఘ పరిధిలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న కారణంగా రోడ్ల పరిస్థితి దారుణముగా అయిన దరిమిలా కొన్ని చోట్ల గురువారం రోజున మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పరిశీలించడం జరిగింది. ట్రైల్స్ గేటెడ్ కమ్యూనిటీ పక్కగా లైటె అండ్ లైట్ వరకు ఉన్న భాగ్యలక్ష్మి కాలనీ రోడ్డు చాలా చోట్ల గతుకుల మయంగా మారడం మరియు ముఖ్యంగా ఈ మధ్యకాలంలో వేసిన నాసిరకం డ్రైనేజీ కవర్లు కుంగి వాహన దారులకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్లో రెండు పక్కల నుంచి వర్షపు నీరు వచ్చి రోడ్డు మధ్య



ప్రాంతంలో నిలుచుట కారణంగా స్థానికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. వర్షపు నీరు పోవుటకు సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయమని పలుమార్లు స్థానికులు కోరినప్పటికీ మున్సిపాలిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం పరిపాటిగా మారిందని. పంచవటి కాలనీ మెయిన్ రోడ్డు కూడా గతుకుల మయంగా మారింది. లాంకో హిల్స్ 132 కే.వీ సబ్ స్టేషన్ దగ్గర నుంచి లక్ష్మీ నగర్ లో నూతనంగా నిర్మించిన రోడ్డు వరకు రోడ్డు మొత్తం అధ్వానంగా తయారైంది, పరిణామంగా పాదచారులకు వాహనదారులకు ఈ రోడ్డులో ప్రయాణం నరకం చూపిస్తున్నది. ఇక ఈ రోడ్ లో భారీ వాహనాలు తిరుగుతున్న కారణంగా వాహన దారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కావున మున్సిపాలిటీ వారు తక్షణమే స్పందించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని బి.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఇట్టి కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, గుట్టమీద నరేందర్, యాలాల కిరణ్, షేక్ అరీఫ్ మొహమ్మద్, సుమన్, ప్రవీణ్, బాబురావు, దస్తగిరి మొదలగు వారు పాల్గొన్నారు.

# ఉమ్మడి పుల్కల్ మండలంలో కుండ పోత వర్షం

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు

## చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

## దిక్కు తోచని స్థితిలో రైతన్నలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, ఉమ్మడి పుల్కల్ మండలంలోని పలు గ్రామాలలో పంట పొలాలు నీట మునిగి, చెరువు కట్టలు తెగిపోయి, రోడ్ల మీద వర్షం నీరు రావడంతో ప్రయాణికులకు రాకపోక లకు ఇబ్బంది కలిగింది, రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట తమ కళ్ల ముందే నీట మునిగిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు, అన్నదాతలు సాగు చేసిన పలు రకాల పంటలు, పూర్తిగా నీట మునిగి ఏ పొలాలను చూసిన చెరువులను తలపిస్తున్నాయి, ఉమ్మడి పుల్కల్ మండలం లో వేల ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటలు రైతులు సాగు చేశారు, పంటల సాగు కోసం రైతులు లక్షల రూపాయలు పంటలకు పెట్టుబడులు పెట్టారు, సాగుచేసిన పంటలు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి రావడంతో, రైతులు పంటల మీద ఎంతో ఆశలు





పెట్టుకున్నారు, కానీ ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు పూర్తిగా జలమయమయ్యాయి, దీంతో రైతులకు ఏం చేయాలో తోచక దిక్కు తోచని అయోమయ పరిస్థితిలో పడ్డారు, నష్టపోయిన పంటలను గుర్తించి ప్రభుత్వం, తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

# బండి చొరవతో వరదలో చిక్కుకున్న వాళ్లు సురక్షితం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, గంభీరావుపేట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా లో బుధవారం రోజు నుండి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నర్మల వరదలో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ల ద్వారా సురక్షితంగా రక్షించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజల సహాయం కోసం మరో రెండు హెలికాప్టర్లు సిరిసిల్లలోని సిద్ధంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.


నర్మల వరదలలో చిక్కుకున్న ఐదుగురిని రక్షించేందుకు సమాచారం అందించిన వెంటనే స్పందించిన కేంద్ర మంత్రులు అమిత్ షా కు, రాజ్నాథ్ సింగ్ బండి సంజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వాయిస్ ఏనా కమాండర్ వివిఎస్ షైన్, ఆయన బృందానికి ధన్యవాదాలు తెలిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.

# వినాయక చవితి సంబరాలు

## గ్రామ గ్రామాన కొలువుదీరిన గణనాథులు

## గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు యువజన సంఘాల నాయకులు వినాయక మండపాలను ఎంతో సుందరంగా అలంకరణ చేసి, గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అయితే పుల్కల్ మండల కేంద్రంలో మల్లికార్జున యూత్ సభ్యులు భారీ గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించారు, ఉమ్మడి పుల్కల్ మండలం లో ఏగ్రామంలో లేని విధంగా గణేష్ మండపాన్ని అతి సుందరంగా ముస్తాబు చేసి , బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆ భారీ గణపతికి, అన్ని రకాల నైవేద్యాలు సమర్పించి, గ్రామ పూజారి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇట్టి వినాయకుని చూడడానికి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు, వినాయకుల మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పుల్కల్ పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో మల్లికార్జున యూత్ సభ్యులు, ఇతర సంఘాల సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు...

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ... బండి రమేష్



**కూకట్పల్లి (ప్రజాబలం) ఆగస్టు 28 :**కూకట్పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ రాజు కాలనీ కి చెందిన రాసమల్ల అనసూయ(69), రాసమల్ల కొమ్మలు, అనారోగ్యం కారణంగా నిమ్స్ హాస్పిటల్ లో చేరడం జరిగింది.వారికి (స్టంట్, ఐ వి ఎల్ బెలూన్) సర్జరీ చేయాలని సూచించడం తో వారి కుమారుడు రాజేందర్ కూకట్పల్లి లోని గొట్టుముక్కల వెంకటేశ్వర రావు కార్యాలయంలో సంప్రదించగా గొట్టిముక్కల వెంకటేశ్వరరావు బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహానిది కి దరఖాస్తు చేయించడం జరిగింది. ప్రభుత్వ పెద్దల సహకారంతో వారికి ఎల్ వో సి ద్వారా 4లక్షల మంజూర్ చేయించడం జరిగింది ఆ లెటర్ ని కూకట్పల్లి హేమ దుర్గ భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ చేతుల మీదుగా వారి కుమారుడికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వర రావు మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య ,కొప్పిశెట్టి దినేష్ , సాధు ప్రతాప్ రెడ్డి, గంధం రాజు, ఆకారం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**ఆగస్టు 28, 2025-నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు.

గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడిన కలెక్టర్, అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్నవారు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 9100577132 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టులు, చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు లోతట్టు పరిసరాలకు వెళ్లరాదని, మత్స్య కారులు, పశు కాపరులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

లక్ష్మణచందా మండలంలోని మునిపల్లి గ్రామంలో వాగు అవతలి వైపు చిక్కుకుపోయిన శంకర్ అనే పశువుల కాపరిని ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో సురక్షితంగా రక్షించగలిగామని కలెక్టర్ వివరించారు. జిల్లా ప్రజలంతా సురక్షితంగా ఉండాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి రూపంలో విగ్రహం తొలగించిన పోలీసులు

**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్ హబీబ్ నగర్ బోయగూడ కామన్ లో రేవంత్ రెడ్డి రూపంలో ఉన్న విగ్రహంను పోలీసులు తొలగించారు. బుధవారం రాత్రి పూజకు ముందు అపార్ట్మెంట్ లో ఏర్పాటు చేసిన మండపం దగ్గరకు సౌత్ వెస్ట్ డీసీపీ విజయ్ కుమార్ వెళ్లారు. భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటూ నిర్వాహకుడు సాయి కుమార్ ను పోలీసులు హెచ్చరించారు. ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఈ మండపాన్ని ఏర్పాటు చేసాడు. రేవంత్ రెడ్డి రూపం విగ్రహం తొలగించి మరో విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. దాంతె రేవంత్ రెడ్డి రూపంలో విగ్రహం మార్చి మరో విగ్రహం నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. రేవంత్ రెడ్డి రూపంలో విగ్రహం ఏర్పాటు చేయడంతో పలు అభ్యంతరాలు వచ్చాయి. ఎమ్మెల్యే రాజాసింగ్ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కు పిర్యాదు చేసారు.

## పశువుల కాపరి శంకర్‌ను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షించాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.





**ఆగస్టు 28, 2025-నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** నిర్మల్ జిల్లా లక్ష్మణచందా మండలం మునిపల్లి గ్రామంలో వాగు ప్రవాహం అవతలి వైపు చిక్కుకున్న పశువుల కాపరి శంకర్‌ను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షించాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

వరద నీటి ప్రవాహం తీవ్రంగా ఉన్నా, ప్రత్యేక ప్రణాళికతో రెండు బోట్ల సాయంతో బృందాలు అక్కడికి చేరుకొని శంకర్‌ను కాపాడాయని చెప్పారు. అంతకుముందు అధికారులు డ్రోన్ ద్వారా ఆహార పదార్థాలు, సెల్‌ఫోన్‌ను పంపించి, అతనితో నిరంతరం సంప్రదింపులు కొనసాగించారని కలెక్టర్ వివరించారు. ఈ ఆపరేషన్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, స్థానికులు సమన్వయంతో కృషి చేయగా, వారందరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. భారీ వరద ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




**సనత్ నగర్ ప్రజాబలం ప్రతినిధి:** ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు ఎస్సార్ నగర్ సీఐ శ్రీనాథ్ రెడ్డి కి నవధాన్యాల వినాయకుడి ఇవ్వడం జరిగింది జిల్లా నాయకుల్లో పొలిమేర సంతోష్ కుమార్ మాదిగ ప్రసాద్ మాదిగ నారాయణ మాదిగ రమేష్ మాదిగ పాల్గొన్నారు

# ఫీజుల కోసం ట్రస్ట్ బ్యాంకు వద్దు..

# స్కాలర్ షిప్స్ ఫీజు బకాయిలు చెల్లించాలి

**119 బి.సి గురుకులాలు, 100 బి.సి కాలేజి హాస్టళ్ళు మంజూరు చేయాలి**

**తెలుగు సంక్షేమ భవన్ ను ముట్టడించిన బిసి విద్యార్థి సంఘం**



**హైదరాబాద్ ఆగష్టు 28 ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 6000 కోట్లు వెంటనే చెల్లించాలని 100 బిసి కాలేజీ హాస్టలు మంజూరు చేయాలనీ, 119 బి.సి గురుకులాలు మంజూరు చేయాలనీ, బి.సి. గురుకుల పాటశాలలో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బీచి విద్యార్థి %ఖఅస్త్రష్టుఎ% రాష్ట్ర అద్యక్షులు వేముల రామ కృష్ణ నేతృత్వం లో వేలాది మంది విద్యార్థులు హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ వద్ద తెలుగు సంక్షేమ భవన్ ముట్టదించారు.. గుంపులు గుంపులుగా విద్యార్థులు వేలాదిగా తరలివచ్చారు, పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావడంతో పోలీసు బందోబస్తు భారీగా ఏర్పాటు చేశారు. ఈ ముట్టడికి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి ఆర్. కృష్ణయ్య ప్రసంగిస్తూ- ఏంటో ముఖ్యమైన స్కాలర్ షిప్ , ఫీజు బకాయిలు, స్కీమును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ స్కీము పెట్టిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ కూలీల పిల్లలు, మెడిసన్, ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు చదువుతున్నారు, సమాజంలో గుణాత్మకమైన మార్పు ప్రారంభమైంది చైల్డ్ లేబర్, అరికట్టబడింది, ప్రతి ఒక్కరు ఉన్నత విద్యా చదువుకుంటున్నారు ఈ గుణాత్మకమైన మార్పును ఆహ్వానించేది పోయి చదువు కోకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈ ఫీజ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అష్ట కష్టాల పాలవుతున్నారు. ఈ ఫీజులు కట్టాలని కాలేజీ విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు వచ్చినవారికి అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్లు తెసుకోలేక కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారు. పీజీ కోర్సులలో సీట్లు పొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉద్యోగాలు పొందిన వారు ఇతర దేశాలలో ఉద్యోగాలు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీనితో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. విదేశాలకు చదువుకోవడానికి సీట్లు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు లేక వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇక కాలేజీ యాజమాన్యాలు కష్టాలు కూడా చెప్పతరం కాదు అద్దె భవనాల అద్దె కట్టడం లేదు. కాలేజీ లెక్చరర్ల జీతాలు నెలల తరబడి ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారు లెక్చరర్లు, జీతాలు రాక కుటుంబాలు పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ గురుకుల పాఠశాలలో సీట్లు లభించక తెలుగు సంక్షేమ భవన్ చుట్టూ రోజుల తరబడి ప్రజలు తిరుగుతున్నారు సంబంధిత అధికారులు పట్టించుకోలేకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వసతి సౌకర్యం ఉన్నచోట అదనపు సెక్షన్లు ప్రారంభించాలని అలాగే ప్రతి క్లాసులో 20% సీట్లు అదనంగా పెంచాలని కోరారు. ఇక బీసీ కాలేజీ హాస్టల్ లో సీట్లు దొరకగా విద్యార్థులు రైల్వేస్టేషన్లో, బస్టాండ్లలో, స్నానాలు చేస్తూ రాత్రి పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అందుకుగాను కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టల్లు మంజూరు చేయాలని ప్రస్తుతం ఉన్న 20% సీట్లు పెంచాలని కోరారు.

ఈ ముట్టడిలో కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రంగ రెడ్డి జిల్లా అద్యక్షులు చంద్ర శేఖర్ గౌడ్, రాజు నేత, నిఖిల్, యస్.రవి కుమార్ యాదవ్, రవి గుజ్జ కృష్ణ, నంద గోపాల్, సుదాకర్ ముదిరాజ్, లతో పాటు అనేకమంది విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు





**సనత్ నగర్ ప్రజాబలం ప్రతినిధి:** సనత్ నగర్ నియోజకవర్గంలోని సుభాష్‌నగర్ గణేష్‌మహరాజా మండపంలో కొలువుదీరిన గణనాధుడు

# ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన

# ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**హైదరాబాద్ ఆగస్టు 28 ప్రజాబలం ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధుల కార్యక్రమంలో భాగంగా గురువారం గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రం లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశం లో మాటాడుతూ రేషన్ కార్డు,డబుల్ బెడ్ రూం,రుణమాఫీ సమస్యలపై నా దృష్టికి తీసుకొని రావడం జరిగింది ప్రజావాణి కార్యక్రమం ఇది మంచి కార్యక్రమం గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇవ్వలేదుబిఆర్ఎస్ పార్టీ పేద ప్రజలను పట్టించుకోలేదుమా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందిడబుల్ బెడ్ రూం ఇల్లు నియోజకవర్గానికి మొదటి దఫాలో 3500 ఇళ్లు ఇవ్వడం జరుగుతుందిగత ప్రభుత్వ హయంలో రేషన్ కార్డుల పంపిణీ చేయలేదుకనీసం రేషన్ కార్డుల్లో పేర్లు ఎక్కించడం,లేని వారివి తొలగించడం లేదు....అందుకే ఇప్పుడు ప్రభుత్వం పై చాలా బడ్జెన్ పడుతుందన్నారు. సిద్దిపేట,సిరిసిల్ల,గజ్వేల్ లో మాత్రమే గత ప్రభుత్వ హయంలో అభివృద్ధి చెందాయిమా ప్రభుత్వ హయంలో అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చేస్తాంలక్ష కోట్ల రూపాయలు వెచ్చించి కాళేశ్వరం కట్టారు... పాలమూరు రంగారెడ్డిని ప్రాజెక్టు పూర్తి చేయలేదుగత ప్రభుత్వం దక్షిణ తెలంగాణను పూర్తిగా విస్మరించిందిఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు హరీష్ రావు హిమయత్ సాగర్ నిండటం వల్ల మూసి పైన మాట్లాడి ఉంటారు ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి రాజకీయాలు చేస్తున్నారు హరీష్ రావు నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డిప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలను ఆదుకోవటానికి సిద్ధంగా ఉందిబీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందికేసీఆర్ అనుభవం ఉన్న వ్యక్తి అసెంబ్లీకి రావాలని,కాళేశ్వరంపై కేసీఆర్ స్పందించాలన్నారు.

## పొంగిపొర్లుతున్న గండి చెరువు

## ట్రాఫిక్ డైవర్షన్... పోలీసుల పహారా



**యాదగిరిగుట్ట, ఆగస్టు 28 ప్రజాబలం ప్రతినిధి:** :వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు వంకలు నిండి పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు... రహదారులు జలమయం అయ్యాయి. మండలంలో అనేక చోట్ల రాకపోకలు బంద్ అయ్యాయి. ఇక పట్టణంలోని గండి చెరువు పొంగిపొర్లుతోంది. దీంతో తూమ్ గేట్లు ఎత్తి నీటిని అధికారులు దిగువకు వదిలారు. ముందు జాగ్రత్త చర్యగా యాదగిరి పల్లి వద్ద పోలీసులు డైవర్షన్ ఏర్పాటు చేశారు. వంగపల్లి నుండి యాదగిరిగుట్టకు వచ్చే వాహనాలు రింగురోడ్డు మీదుగా అనుమతిస్తున్నారు. అదేవిధంగా యాదగిరిగుట్ట నుండి వంగపల్లి వైపు వెళ్లే వాహనాలు రింగురోడ్డు పై నుండి యాదగిరి పల్లి మీదుగా వెళ్లాలని పోలీసులు వాహనదారులకు సూచిస్తున్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

యాదాద్రి ఆత్మకూర్ (ఎం) మండలంలోని మోరిపిరాల బిక్కేరు వాగు లోలెవెల్ కాజ్ వే పై రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నీరు ప్రవహిస్తుంది. ఒక ద్విచక్ర వాహనదారుడు నీటి ప్రవాహాన్ని అంచనా వేయకుండా దాటడానికి ప్రయత్నించడంతో వరద ఉధృతికి మధ్యలో వాహనం ఆగిపోయింది. స్థానికులు తక్షణం స్పందించి బయటికి లాగారు.

# హైదరాబాద్, ఢిల్లీ మధ్య ముఖ్యమంత్రిని కాంగ్రెస్ అధిష్టానం ఫుట్‌బాల్‌లా తిప్పేస్తోంది

**ఇది కాంగ్రెస్‌లోని అంతర్గత విభజనకు, రేవంత్ రెడ్డి పరిస్థితికి నిదర్శనం**
**పదవి ఉంది కదా అని పిచ్చి పిచ్చి ప్రేలాపన చేసుకుంటూ, పాదయాత్రల పేరుతో నాటకాలు చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్**
**దిగజారుడు రాజకీయాలు మానాలని కాంగ్రెస్ పార్టీకి డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హితవు**



కాంగ్రెస్ అధిష్టానం హైదరాబాద్ %-% ఢిల్లీ మధ్య ముఖ్యమంత్రిని ఫుట్‌బాల్‌లా తిప్పేస్తోందని బిజెపి తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఇది కొత్త విషయం కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు తెలంగాణ %-% రెండింటిలోనూ ముఖ్యమంత్రులను ఫుట్‌బాల్‌లా ఆడుకోవడం తరచుగా చూసిన సంగతే.ప్రస్తుతం ఈ ముఖ్యమంత్రి కూడా అదే పరిస్థితికి లోనై హైదరాబాద్ %-% ఢిల్లీ కి చక్కర్లు కొడుతూ, రాజకీయంగా నలిగిపోతున్నారు.ఇది కాంగ్రెస్‌లోని అంతర్గత విభజనకు, రేవంత్ రెడ్డి పరిస్థితికి నిదర్శనం. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డిని బీహార్ ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని, తెలంగాణ నుంచి "బీహార్ ట్యాక్స్" వసూలు చేయాలని చూస్తోంది. ఆయనను ఒక పావులా తిప్పుతూ వ్యవహరిస్తున్నారు.ఒకవైపున ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు ఎదురవుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటు చోరీ గురించి కొత్తగా మాట్లాడుతున్నారు. కానీ అసలు ఓటు చోరీ ఎవరు చేస్తున్నారో ప్రజలకు బాగా తెలుసు.కొత్తగా పిసిసిఐ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్ ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నాయకుడు. ఒకసారి కూడా ధైర్యంగా పోటీ చేయని ఆయనను కేవలం అధిష్టానం నిర్ణయంతో పదవిలోకి తీసుకురావడం జరిగింది.పదవి ఉంది కదా అని పిచ్చి పిచ్చి ప్రేలాపన చేసుకుంటూ, పాదయాత్రల పేరుతో నాటకాలు చేస్తున్నారు.ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పిసిసిఐ అధ్యక్షులుగా పనిచేసిన అనేక మంది నాయకుల రాజకీయ జీవితం ఖతం అయింది.

వారు కాంగ్రెస్‌ను వదిలి వేరే పార్టీలకు వెళ్లి అక్కడక్కడ బ్రతికే ప్రయత్నం చేసిన సందర్భాలు రాష్ట్ర చరిత్రలో ఎన్నో ఉన్నాయి.నాలుగు పార్టీలు మార్చి వచ్చినవారు ముఖ్యమంత్రి అవుతాడు. సస్పెండ్ అయినవాడిని మళ్లీ తీసుకుంటే, అతనే సిఎల్పి లీడర్ అవుతారు. ఈ విధంగానే కాంగ్రెస్ పార్టీ నడుస్తోంది. ఇది కాంగ్రెస్ పార్టీ చరిత్రలో తరచూ జరిగే విషయమే. గతంలోనూ అనేక మంది నాయకుల పరిస్థితి చూసినా ఇదే నిజం అని అర్థమవుతోంది.ఇప్పుడు వీళ్ళు ఓటు చోరీ గురించి మాట్లాడుతున్నారు. కానీ అసలు ఖజానా చోరీలో జైలుకి వెళ్లి, బెయిల్ మీద బయటికి వచ్చిన వారు ఎవరో ప్రజలు మర్చిపోలేదు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఖజానా చోరీ కేసులో బెయిల్ మీద ఉన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కూడా అదే పరిస్థితి. అంతేకాదు, యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కూడా ఖజానా చోరీ కేసులో బెయిల్ మీద ఉన్నారు అన్నది వాస్తవం కాదా? అయితే ఈ రోజుల్లో వీళ్ళే ఓటు చోరీ అని పదం తీసుకొచ్చి మాట్లాడుతున్నారు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీ చోరీలకు పాల్పడుతూ, అవి కుంభకోణాలుగా మారి, వారి నాయకులు బెయిల్ మీద బయట తిరుగుతూ ఉంటారు. మరొకవైపు కొత్తగా ఓటు చోరీ గురించి మాట్లాడి మా మంత్రులను విమర్శించడం, మా గెలిచిన పార్లమెంట్ సభ్యులను ప్రశ్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో దిక్కూ, మొక్కూ లేని పరిస్థితి కనిపిస్తోంది. ఎంఎల్సీ ఎన్నికలలో పోటీ చేయడానికి కూడా అభ్యర్థులు లేరు. పోటీ చేసిన చోట ఘోర ఓటమి ఎదురైంది.అవకాశం ఉన్నప్పటికీ ఎంఐఎంకి వ్యతిరేకంగా పోటీ చేయరు. మరొకచోట తమను రక్షిస్తున్న న్యాయవాదికి వ్యతిరేకంగా పోటీ చేయరు. ఇంత దయనీయమైన పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఇది వీళ్ళ వ్యవహారం, ఇది వీళ్ళ ఆలోచన. కాబట్టి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానాలని మేము కాంగ్రెస్ పార్టీకి హితవు పలుకుతున్నాం.అసలు పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్... మీనాక్షి నటరాజన్ గారు లేకుండా ఒక్క ఏరియాలోనైనా పాదయాత్రకు వెళ్తే, అతని సొంత పార్టీ వాళ్లే నరకం చూపిస్తున్నారు. అందుకే ఆయన ఎల్లప్పుడూ ఇంచార్జ్ కవచంలోనే తిరుగుతున్నాడు.ఒక అధికార పార్టీకి చెందిన నాయకుడు పాదయాత్ర చేయకుండా, ఆ పార్టీ ఇంచార్జ్ ముందుండి పాదయాత్ర చేయాల్సి రావడం కాంగ్రెస్ పార్టీ నాయకులకే అవమానం. ఇది కాంగ్రెస్ చరిత్రలో జరిగే అతి దౌర్భాగ్యకరమైన పరిస్థితి.ఇప్పుడు ప్రకృతి వైపరీత్యం వల్ల ప్రజలు అన్నమో రామచంద్ర అంటూ ఆర్తనాదాలు చేస్తున్నారు. రక్షించండి, కాపాడండి అని కేకలు వేస్తున్నారు. అయితే, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం బీహార్ టాక్స్ కోసం హైకమాండ్ మెప్పు పొందేందుకు పర్యటనలు చేస్తున్నారు. ప్రజల రక్షణ బాధ్యతలు మరిచి, పార్టీ రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మొదట తన విధులు నిర్వర్తించాలి.మా బీజేపీ కార్యకర్తలు మాత్రం ఎల్లప్పుడూ 24 గంటలూ ముంపు ప్రాంతాల్లో, అధిక వర్షం కారణంగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల వరకు ప్రజలకు సహాయం చేయడానికి ముందుంటున్నారు.ఇక బీసీ రిజర్వేషన్ బిల్లును పెట్టకముందే న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి, రాజ్యాంగపరమైన సమస్యలు లేకుండా ముందుకు వెళ్లాల్సి ఉండేది.కానీ కాంగ్రెస్ మాత్రం ఇక్కడి నుంచే రాజ్యసభకు ఎన్నికైన ఎంపీని, అది కూడా బిఆర్ఎస్ %-%ఎంఐఎం అండతో, కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన వ్యక్తిని పిలిపించి, న్యాయపరమైన చిక్కులు ఎలా పరిష్కరించాలో అడగడం అసమర్థత, నిర్లక్ష్యం, అనాలోచిత పాలనకు నిదర్శనం.కాంగ్రెస్ చరిత్ర %-% సస్పెన్షన్ %c% రీఎంట్రీల చక్రం. ఇది కొత్తది కాదు. కాంగ్రెస్ పార్టీ చరిత్రే ఇది. సస్పెండ్ చేసిన వారినే మళ్లీ పిలిచి పిసిసి అధ్యక్షులుగా చేస్తారు. కొంతమందిని ముఖ్యమంత్రులుగా కూడా చేస్తారు.ఎంఎల్యేలను సస్పెండ్ చేసి, మళ్లీ తీసుకోవడం కూడా ఇలాగే తరచూ జరుగుతుంది. ఈ విధంగానే కాంగ్రెస్ పార్టీ తన కాలాన్ని గడిపేస్తూ వస్తోంది.బీజేపీ లక్ష్యం మాత్రం స్పష్టంగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్‌ని పూర్తిగా ఓడించి, కాంగ్రెస్‌ని నిలవరించడం.ఆ దిశలోనే రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మేము తీసుకున్న నిర్ణయాలు ఉన్నాయి. రాష్ట్రం హితం కోసం, ప్రజల భవిష్యత్తు కోసం బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుంది.

# వర్షాల పై రాజకీయాలు చేయొద్దు

**వరదలో ఆస్తులు నష్టపోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది**
**అన్ని టిపిసిసి కార్యదర్శి గజ్జల కాంతం విజ్ఞప్తి**



హైదరాబాద్ ఆగస్టు 28 వర్షాల పై రాజకీయాలు చేయొద్దని,వరదలో ఆస్తులు నష్టపోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని టిపిసిసి కార్యదర్శి గజ్జల కాంతం విజ్ఞప్తి చేశారు.వర్షాలు అధికంగా కురిసి ఉధృతంగా వరదలు వస్తున్నాయి ఈ సమయంలో రాజకీయాలు చేయొద్దు అని అన్ని పార్టీలను కోరుతున్నామని ముఖ్యమంత్రి,మంత్రులు ఎప్పటికప్పుడు అధికారులతో వరదలపై సమీక్ష చేస్తున్నారువరదలలో ఆస్తులు నష్టపోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది కాంగ్రెస్ పార్టీ నాయకులు సహాయక చర్యల్లో పాల్గొన్నారుప్రజలను కాపాడాల్సి కోవాల్సిన బాధ్యత అందరి పైన ఉంది సినిమా ఇండస్ట్రీ,బిజినెస్ మాన్ స్పందించి ఆదుకోవాలి ఆయన కోరారు.కేంద్ర మంత్రులు బండి సంజయ్,కిషన్ రెడ్డి ఈ సమయంలో రాజకీయాలు చేయకండి....చేతనైతే కేంద్రం నుండి సహాయం చేయండిహరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని,వర్షాలు అనేది పకృతి పైన ఆధారపడి ఉంటుందిబిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్లో వర్షాలు వచ్చాయి....ఆ సమయంలో మేము రాజకీయాలు చెయ్యలేదన్నారు.

# కేంద్ర పథకాలే రాష్ట్రానికి దిక్కు

**రాష్ట్ర ఖజానా ఖాళీ తో కుంటు పడిన అభివృద్ధి**
**బీజేపీ పాలన కోసం ప్రజల తహతహ**
**ఎన్నికలు ఏవైనా బీజేపీదే హవా అంటున్న రచ్చ శ్రీనివాస్**
**డా. రాగి సహదేవ్ ( సీనియర్ జర్నలిస్టు )**



యాదగిరిగుట్ట,ఆగస్టు 28 (ప్రజాబలం ప్రతినిధి): బిజెపి పాలన కోసం గ్రామాల ప్రజలంతా ఎదురుచూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.... స్థానిక ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో బిజెపి సత్తా చాటుతుందని అన్నారు. దేశంలో అత్యధిక సభ్యత్వం గల పార్టీల్లో బిజెపి అగ్రస్థానంలో ఉందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గంలోని పట్టణాలలో ఇతర పార్టీలకన్నా బిజెపికి అత్యధిక ఓట్లు వచ్చాయన్నారు. అంతేకాకుండా మేజర్ గ్రామపంచాయతీలో కూడా తమ పార్టీకి ఆదరణ పెరిగిందన్నారు. జడ్పిటిసి ,ఎంపీటీసీ, ఎంపీపీ, మున్సిపల్, గ్రామపంచాయతీ.. ఎన్నికలు ఏవైనా సరే బిజెపిదే హవా అని అన్నారు. దేశ విదేశాలలో త్వరితగతిన ప్రధాని నరేంద్ర మోడీ హవా ఎలా పెరుగుతూ వచ్చిందో... అలాగే దేశంలోనూ బిజెపికి ప్రజాదరణ పెరుగుతూ వస్తోందని.. అనేక రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దీన్ని సూచిస్తున్నాయన్నారు.

రాష్ట్ర ఖజానా ఖాళీ అయి కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టుకుంటూ వస్తుందని రచ్చ శ్రీనివాస్ అన్నారు. ప్రజలలో రాజకీయ పరిణితి గణనీయంగా పెరిగిందని.. రేషన్ సరఫరాతో సహా ఏ పథకం తీసుకున్నా అందులో సింహభాగం నిధులు కేంద్రానివే అని ప్రజలు గుర్తించడం ప్రారంభమైందని.... కేంద్ర పథకాలకు కాంగ్రెస్ ముసుగు తొడిగే ప్రయత్నాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారని చెప్పారు. కేంద్ర పథకాలన్నీకూడా గ్రామీణ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండటంతో... ఇప్పటివరకు టిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు ఇక బిజెపి పరిపాలన కోసం గ్రామీణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు.

**గుట్టలో మూడు వాటర్ ట్యాంకులు**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర బిజెపి ప్రభుత్వ నిధులతోనే మూడు మంచినీటి ట్యాంకులు నిర్మాణం కాబోతున్నాయని రచ్చ శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు రాష్ట్రం కేంద్రం పైన పూర్తిగా ఆధారపడి ఉందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, యువకులు, విద్యార్థులు , కార్మికులు ఇలా అందరి సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వానివేనని అన్నారు. విద్య, వైద్యరంగ అభివృద్ధికి బిజెపి చేస్తున్న కృషిని ప్రజలు క్రమంగా గుర్తించడం ప్రారంభించారన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు మంజూరు చేయడాన్ని బిజెపి సహించదన్నారు. పార్టీలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను బిజెపి ఎంపిక చేయటం అందరికీ తెలిసిందే అన్నారు.

**ఆలేరులో కమలవికాసమే**

ఆలేరు నియోజకవర్గంలో నియోజకవర్గం ,మండలం ,పట్టణం ,గ్రామీణ స్థాయిలోనూ బిజెపి సంస్థాగతంగా బలోపేతంగా ఉందని రచ్చ శ్రీనివాస్ అన్నారు. ప్రతి సమస్య పైన పోరాడే బిజెపి శ్రేణులను చూసి ఇతర పార్టీలు జంకుతున్నాయన్నారు. తమ పార్టీలో ఎన్నికల్లో పోటీ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేసే నాయకత్వం తమ బిజెపికి ప్రధాన ఆకర్షణ అన్నారు. ఇతర పార్టీల మాదిరిగా తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని, సొంతంగానే అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకొని సత్తా ఉందని స్పష్టం చేశారు.

**రాయగిరి స్టేషన్ అభివృద్ధి**

2016లో 17లో రూ. 330 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఘట్కేసర్ నుండి రాయగిరి వరకు ఎంఎంటీఎస్ రైలు పొడిగించే ప్రాజెక్టు కాస్త గత టిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ,అసమర్థత కారణంగా కాలయాపన జరిగిందని రచ్చ శ్రీనివాస్ అన్నారు. యాదగిరిగుట్ట అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వమే అమృత్ భారత్ పథకం కింద... పెరిగిన అంచనా వ్యయంతో సొంతంగానే ఎంఎంటీఎస్ రైలు రాయగిరి వరకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తోందన్నారు. యాదాద్రి రైల్వే స్టేషన్ గా నామకరణం పొందిన రాయగిరి రైల్వే స్టేషన్ ను దాదాపు 25 కోట్లతో ఆధునికరిస్తున్న పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. పనులు పూర్తయితే సికింద్రాబాద్ నుండి యాదగిరిగుట్టకు కేవలం 20 రూపాయల టికెట్ తో యాత్రికులు వచ్చే వీలు కలుగుతుందన్నారు.

# క్రీడలతో పని ఒత్తిడి నుంచి ఉపశమనం

**ఉద్యోగులకు నిరంతరం క్రీడా పోటీలు**
**రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



హైదరాబాద్ ఆగస్టు 28 ప్రజాబలం ప్రతినిధి:పసి పిల్లలనుండి పండు ముదుసలి వరకు అన్ని వర్గాల వారు క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా తెలంగాణ ప్రభుత్వం క్రీడా శాఖ కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జాతీయ క్రీడ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈరోజు ఎల్బీ ఇండోర్ స్టేడియంలోఉద్యోగుల ఆటల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన క్రీడా విధానంలో ఎటువంటి వివక్షత లేకుండా అన్ని వయసుల వారు వర్గాల వారు క్రీడల్లో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు.అనునిత్యం పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు ఉపశమనానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని, ఉద్యోగులు ఆరోగ్యకరంగా ఉంటే ప్రభుత్వ పథకాలు పటిష్టంగా అమలవుతాయి అని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో క్రీడా ప్రోత్సాహక ప్రభుత్వం అన్ని వర్గాలకు క్రీడల్ని అందుబాటులోకి తేవాలని కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గత సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవం లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించామని అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి సంవత్సరం కూడా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు, టీజీవో కార్యదర్శి సత్యనారాయణ సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శి ప్రేమ్ దేవేందర్, భాగ్యనగర్ టీఎన్జీవో అధ్యక్షులు సత్యనారాయణ హైదరాబాద్ టీజీవో అధ్యక్షుడు కృష్ణ యాదవ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాస్య నాయక్ కార్యదర్శి ఖాదీర్ హుస్సేన్ వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు కోచెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**29 న గచ్చిబౌలి లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు**

హాకీ మాంత్రికుడు స్వర్గీయ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో రేపు ఆగస్టు 29 గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను జరపడానికి స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేసింది. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో ఇటీవల వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానించడం తోపాటు వివిధ క్రీడా సంబంధిత కార్యక్రమాలు ను ఏర్పాటు చేశారు. అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీతలతో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com